



- నల్లమలలో పులి రక్షణకు రెస్క్యూ ఆపరేషన్
- ఉచ్చుకు చిక్కి గాయపడ్డ పులికి శస్త్ర చికిత్స
- 21రోజుల పాటు మూడు బృందాలు రేయింబవళ్లు గస్తీ
- డాక్యుమెంటరీ విడుదల చేసిన ఎన్‌ఎస్‌టీఆర్

ఆపరేషన్ టీ132ఎఫ్

నల్లమల అంటేనే పెద్దపులులకు ఆవాసం. ఇటీవల కాలంలో నల్లమలలో పులుల సంఖ్య ఆశాజనంగా ఉండటంతో దీనిపై వేటగాళ్ల కన్నుపడింది. అందుకే నల్లమలలో తరుచూ ఉచ్చులతో వేటగాళ్లు తమ ఉనికిని చాటుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం (ఎన్‌ఎస్‌టీఆర్) పరిధిలో ఓ ఉచ్చుకు చిక్కి తప్పించుకుని తీవ్రగాయమై తల్లడిల్లిన ఓ పెద్దపులిని అటవీశాఖ అధికారులు ఎంతో ధైర్యసాహసాలను ప్రదర్శించి రక్షించారు. ఈ రెస్క్యూ ఆపరేషన్ గురించి తొలినుంచి గోప్యంగా ఉంచిన ఎన్‌ఎస్‌టీఆర్ అధికారులు మంగళవారం వరల్డ్ టైగర్స్ డే సందర్భంగా 'ది రెస్క్యూ ఆఫ్ టీ132ఎఫ్' పేరిట వీడియో డాక్యుమెంటరీ విడుదల చేశారు.


ఉచ్చుకు చిక్కి గాయపడిన టీ132ఎఫ్ పెద్దపులి ఇదే

ఆత్మకూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వు ఫారెస్ట్‌గా పేరుగాంచిన నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్ద పులుల అభయారణ్యం పరిధిలో 2023-24 ఫేస్-4 గణాంకాల ప్రకారం 87 పెద్దపులులు ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. ఇది ఒకింత ఆనందించదగ్గ విషయమే. అయితే ఇదే పెద్దపులులకు ప్రమాదాన్ని తెచ్చిన పెట్టిన అంశంగా పరిగణించవచ్చు. నల్లమలలో పెద్దపులుల సంఖ్య ఎక్కువ అవుతుండటంతో అంతర్రాష్ట్ర వేటగాళ్ల సైతం నల్లమలపై కన్నేశారు. ఈ క్రమంలోనే పెద్దపులులను హతమార్చేందుకు చాలా సులభమైన పద్ధతులను వేటగాళ్లు ఎంచుకుంటున్నారు. బైకులకు వినియోగించే క్లచ్ వైయర్లను ఉచ్చుగా తయారీ చేసి చెట్లకు కట్టేస్తున్నారు. వాటిని గమనించని పులులు ఆ ఉచ్చులో చిక్కి బలవుతున్నాయి. ఒకవేళ ఉచ్చును తప్పించుకుని బయటపడినా.. తీవ్రగాయాల పాలై మృత్యువాతపడుతున్నాయి.

ఉచ్చుకు చిక్కి.. విలవిలలాడుతూ

2025 జూన్ 16వ తేదీ.. ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని నాగలూటి రేంజ్ పరిధిలోని ఇన్‌ఫ్రారెడ్ కెమెరా ట్రాప్స్‌ను రెగ్యులర్ మానిటరింగ్‌లో భాగంగా పరిశీలించగా సుద్దగుంట ప్రాంతంలోని ఓ కెమెరాలో ఓ పెద్దపులి మెడ భాగంలో తీవ్రంగా గాయపడి తల్లడిల్లుతున్నట్లు గుర్తించారు. గతంలో జరిగిన ఓ సంఘటన నేపథ్యంలో గాయపడిన పులిని అలానే వదిలేస్తే అది మరణించే ప్రమాదం ఉన్నట్లు అటవీ అధికారులు పసిగట్టారు. వెంటనే విషయాన్ని నేషనల్ టైగర్స్ కన్జర్వేషన్ అథారిటీ(ఎన్‌టీసీఏ)కు సమాచారం అందించి దాన్ని పట్టుకునే ప్రయత్నం మొదలుపెట్టారు. ఇందులో భాగంగానే ముందుగా పులి సంచార ప్రదేశాన్ని (టెరిటరీ) గుర్తించి ఆ పరిధిలో నాలుగేళ్ల కెమెరా ట్రాప్స్‌ను పరిశీలించారు. చివరికి గాయపడిన పులి టీ132ఎఫ్‌గా నిర్ధారించారు. ఆ తర్వాత పులిని బంధించి చికిత్సలు అందించాలన్న లక్ష్యంతో ది రెస్క్యూ ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టారు.

మూడు బృందాలుగా ఏర్పడి

గాయపడిన పెద్దపులిని రక్షించేందుకు ఎన్‌ఎస్‌టీఆర్ ఫీల్డ్ డైరెక్టర్ కృష్ణమూర్తి, ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ వి.సాయిబాబా, శ్రీశైలం సబ్ డీఎఫ్‌వో అబ్దుల్‌రవూఫ్, బైర్లూటి రేంజ్ అధికారి కృష్ణప్రసాద్ నేతృత్వంలో మూడు బృందాలను ఏర్పాటు చేశారు. ముందుగా గాయపడిన పులి బైర్లూటి రేంజ్ పరిధిలోని పుల్లలచెరువు, తలమడుగు సెక్షన్ ఏరియాల్లో ఎక్కువగా సంచరించినట్లు వివిధ కెమెరా ట్రాప్స్, పగ్ మార్క్, ప్రత్యక్ష వీక్షణం ద్వారా గుర్తించారు. దీంతో ఆ రెండు ప్రదేశాల్లో పులికి ఎరగా ఒక్కో ఆవుదూడను చెట్లకు కట్టేశారు. అలాగే ఆ ప్రదేశాల్లో రేయింబవళ్లు పూర్తిస్థాయిలో మానిటరింగ్ ఉంచారు. ఇందులో ప్రత్యేకించి మత్తు ప్రయోగం చేసేందుకు నలుగురితో కూడిన ట్రాంక్ లైజర్ టీం 20మీటర్ల పరిధిలో, పులి కదకలికలను గుర్తించేందుకు థర్మల్ డ్రోన్ కెమెరాలను పర్యవేక్షించే బృందం 100 మీటర్ల పరిధిలో, పులిని బంధించినట్లయితే వెంటనే దానిని రక్షించేందుకు బ్యాక్ అండ్ టీం ఒక కిమీ పరిధిలో ఉండేలా ప్రణాళిక రూపొందించారు.

ఆరోజు ఏమి జరిగిందంటే...

గాయపడిన పులిని బంధించేందుకు అంతా సిద్ధం చేశారు. అనుకున్నట్లుగానే జూలై 4వ తేదీన రాత్రి ఇసుక గుండం రస్తాలో పెద్దపులి సంచరించింది. ఆ తర్వాత మరునటి రోజు 5వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పుల్లలచెరువు ప్రదేశంలో కట్టేసిన ఆవుదూడను చంపేసింది.

మిగతా 7వ పేజీలో


నీరు తాగేందుకు కూడా అవస్థలు పడుతున్న పులి (ఫైల్)


మత్తుమందు ప్రయోగంతో పులిని బంధిస్తున్న దృశ్యం (ఫైల్)


థర్మల్ డ్రోన్ కెమెరాలతో పులి ఆచూకీ కోసం అన్వేషిస్తున్న అటవీ అధికారులు (ఫైల్)

వితంతువులకు అండగా...

- కొత్తగా స్పౌజ్ పింఛన్లు మంజూరు
- జిల్లాలో 3,430 మందికి అవకాశం
- ఆగస్టు ఒకటిన పంపిణీ



నంద్యాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వితంతు పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. అర్హులైన వితంతువులకు ఆగస్టు ఒకటో తేదీ నుంచి పింఛన్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంది. ఈ మేరకు నంద్యాల జిల్లాలో 3,430 మంది వితంతువులకు పింఛన్‌ను ప్రభుత్వం తాజాగా మంజూరు చేసింది. వీరందరికి ఒకటో తేదీ నుంచి ఒక్కొక్కరికి రూ.4వేలు చొప్పున అందించనున్నారు. అర్హత ఉండి ఏళ్ల తరబడి పింఛన్ కోసం ఎదురుచూస్తున్న బాధిత వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచి సమస్యను పరిష్కరించడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

2,15,708 మందికి రూ.92.85 కోట్లు పంపిణీ

ఆగస్టు ఒకటో తేదీన ప్రతినెల అందించే పింఛన్లతో పాటు కొత్తగా మంజూరైన వితంతు పింఛన్(స్పౌజ్) మొత్తంగా 2,15,708 మందికి పింఛన్ నగదు జిల్లాలో అందించనున్నారు. ఇందులో ప్రధానంగా వృద్ధాప్య పింఛన్ 1,06,000 మందికి.. పాత, కొత్త వితంతు పింఛన్లు 66,055 మందికి, దివ్యాంగ పింఛన్లు 25,256 మందికి, ఒంటరి మహిళా పింఛన్లు 4వేలతో పాటు వివిధ వర్గాలకు చెందిన వారందరికి కూడా పింఛన్లు అందించనున్నారు.

3,430 మందికి పింఛన్లు



ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న వితంతువులకు ప్రభుత్వం పింఛను మంజూరు చేసింది. జిల్లాలో 3,430 మందికి ఎన్టీఆర్ భరోసా పథకం కింద మంజూరైంది. ఇదే క్రమంలో ఇదే విషయాన్ని ఆ వర్గాలకు కూడా తెలియజేశాం. ఆగస్టు ఒకటో తేదీన వితంతు పింఛన్లు అందిస్తాం.
● శ్రీధర్‌రెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ, నంద్యాల

కొత్తగా స్పౌజ్ పింఛన్లు

2019 ఏప్రిల్ నెల నుంచి జూలై 2025 వరకు భర్తలను కోల్పోయిన మహిళలకు పింఛన్లు రాలేదు. గత ప్రభుత్వ హయాంలో కూడా దరఖాస్తున్న చేసుకున్న వివిధ కారణాలతో కొర్రీలు పెట్టి రాకుండా చేశారనే విమర్శలు బాధిత వర్గాల్లో లేకపోలేదు. ఇంటి పెద్దదిక్కు కోల్పోయి ఆవేదన చెందుతున్న వితంతువులకు జిల్లాలో 3,430 మందికి పింఛన్లు మంజూరు చేసి కూటమి ప్రభుత్వ అండగా నిలిచింది.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయండి

దేవదాయ శాఖ రాయలసీమ జోన్ ఇన్‌చార్జి డీఈఈ శ్రీనివాసులు


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీఈఈ శ్రీనివాసులు

మహానంది, జూలై 29 (ఆంధ్రజ్యోతి): భక్తుల వసతి కల్పనలో భాగంగా మహానంది క్షేత్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని దేవదాయశాఖ రాయలసీమ జోన్ ఇన్‌చార్జి డీఈఈ శ్రీనివాసులు కాంట్రాక్టర్లకు తెలిపారు. మంగళవారం మహానంది క్షేత్రంలో రూ.10.50కోట్లతో నిర్మిస్తున్న 55గదుల వసతిగృహం నిర్మాణానికి డీఈఈ మార్కింగ్ ఇచ్చారు. ఆలయ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల నిర్మాణాలను పరిశీలించి నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈవో మధు, దేవస్థానం పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి, నీలకంఠరాజు, సుబ్బారెడ్డి, ఏఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారణకు కృషిచేయాలి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నివారణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ సంస్థ చైర్మన్ కృష్ణయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజకుమారి అధ్యక్షతన జిల్లా అధికారులతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణయ్య మాట్లాడుతూ సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగంపై కేంద్ర ప్రభుత్వం 2001లోనే నిషేధం విధించిందన్నారు. పట్టణాల్లో ప్లాస్టిక్‌ను నియంత్రించే బాధ్యత మున్సిపల్ కమిషనర్లదే అన్నారు. బనగానపల్లెలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా చేపడుతున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ రూ.5లక్షల బహుమతిని ప్రకటించారు. కలెక్టర్ మాట్లాడుతూ బనగానపల్లెలో ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నయంగా జ్యూట్‌బ్యాగ్స్, చేతిసంచులు వినియోగించడంపై ప్రజలకు అవగాహన కల్పించారన్నారు. అధికారులకు జూట్‌బ్యాగ్స్ అందజేశారు. సమావేశంలో డీఆర్‌వో రాము నాయక్, అధికారులు పాల్గొన్నారు.

ఇలాగైతే ఎలా?

- పందికోన జలాశయం తూము సామర్థ్యంలో భారీ తేడా
- ఇన్‌లెట్ తూము సామర్థ్యం 428 క్యూసెక్కులే
- కుడి, ఎడమ కాలువల సామర్థ్యం 816 క్యూసెక్కులు
- 388 క్యూసెక్కుల మేర తేడా
- పూర్తి ఆయకట్టుకు సాగునీరు అసాధ్యమే
- డిజైన్ లోపం వల్ల రైతులకు తప్పని ఇక్కట్లు


జలాశయం నుంచి కుడి కాలువకు నీటిని విడుదల చేసే తూములు ఇవి. సామర్థ్యం 673 క్యూసెక్కులు

కర్నూలు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఏ జలాశయం నుంచి అయినా సరే కాలువలకు ఎంత పరిమాణంలో సాగునీటిని విడుదల చేస్తారో.. అంతకంటే ఎక్కువగా నీరు రిజర్వాయరులో చేరేలా తూములు (ఇన్‌లెట్ స్లూయిస్) ఏర్పాటు చేయాలి. అప్పుడే నిండుకుండలా కళకళలాడుతుంది. పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు ఇవ్వడం సాధ్యం అవుతుంది. కుడి, ఎడమల కాలువల సామర్థ్యంలో సగం నీటిని కూడా విడుదల చేయలేని తూముల వల్ల సాగు సాధ్యమేనా..? అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు ఒకటి రెండు తడులపైనా పంటలకు ఇవ్వడం సాధ్యం అవుతుందా..? అంటే అసాధ్యమేనని సాగునీటి నిపుణులు సమాధానం ఇస్తున్నారు. పత్తికొండ(పందికోన) జలాశయం తాజా పరిస్థితి ఇది. ఇన్‌లెట్ (జలాశయం నింపే తూము) సామర్థ్యం 428 క్యూసెక్కులు అయితే 65 వేల ఎకరాలకు సాగునీరు అందించే కుడి, ఎడమ కాలువల తూములు (అవుట్‌లెట్ స్లూయిస్) సామర్థ్యం 816 క్యూసెక్కులు. ఇన్‌లెట్, అవుట్‌లెట్ మధ్య 388 క్యూసెక్కులు భారీ తేడా ఉంటే జలాశయం నింపేది ఎలా..? ఆయకట్టుకు సాగునీరు ఇచ్చేది ఎలా..? డిజైన్ లోపం రైతులకు శాపంగా మారింది. హంద్రీనీవా విస్తరణలో భాగంగా అదనపు తూములు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉన్నా.. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలు పంపించాలనే ఇంజనీర్లు లక్ష్యం ముందు కరువు రైతుల సాగునీటి డిమాండ్ చిన్నబోయింది.

శ్రీశైలం జలాశయం ఎగువన 40 టీఎంసీలు కృష్ణా వరద జలాలు ఎత్తిపోసి రాయలసీమలోని ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 6.05 లక్షల ఎకరాలకు సాగు, 35 లక్షల జనాభాకు తాగునీరు అందించాలనే ఆశయంతో హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం నిర్మించారు. తొలి దశ (ఫేజ్-1)లో నంద్యాల జిల్లా మాల్యాల నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి జలాశయం వరకు 216.30 కి.మీలు ప్రధాన కాలువ, జిల్లాలో కృష్ణగిరి, పత్తికొండ జలాశయాలు, అనంతపురం జిల్లాలో జీడిపల్లి రిజర్వాయరు నిర్మించారు. ఉమ్మడి జిల్లాలో 8 టీఎంసీలు వినియోగించుకుని 80 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి. అందులో ప్రధాన కాలువ కింద 13,500 ఎకరాలు, కృష్ణగిరి జలాశయం కుడి, ఎడమ కాలువల కింద 5,100 ఎకరాలు, పత్తికొండ జలాశయం కుడి, ఎడమ కాలువల కింద 61,400 ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉంది. ఆయకట్టు, తాగునీరు, నీటి ఆవిరి పరిగణలోకి తీసుకొని రిజర్వాయర్‌లోకి నీటిని వదిలే తూములు (ఇన్‌లెట్), జలాశయం నుంచి కాలువలకు సాగునీరు విడుదల చేసే తూములు (అవుట్ లెట్) సమాన సామర్థ్యం ఉండేలా నిర్మాణం చేయాలని నిపుణులు పేర్కొంటున్నారు.

పత్తికొండ జలాశయ సామర్థ్యం..

పత్తికొండ జలాశయం సామర్థ్యం 1.126 టీఎంసీలు. కుడి కాలువ (లెఫ్ట్ కెనాల్) కింద 10,774 ఎకరాల ఆయకట్టు ఉంది. 143 క్యూసెక్కులు (4.05 క్యుమెక్స్) సామర్థ్యంతో తూము (అవుట్‌లెట్ స్లూయిస్) నిర్మించారు. ఎడమ కాలువ (రైట్ కెనాల్) కింద పత్తికొండ, దేవనకొండ మండలాల్లో 50,636 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ కాలువకు 673 క్యూసెక్కులు (19.081 క్యుమెక్స్) ప్రవాహ సామర్థ్యంతో తూము (అవుట్‌లెట్ స్లూయిస్) ఏర్పాటు చేశారు. అంటే కుడి, ఎడమ కాలువల కింద 61,400 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 816 క్యూసెక్కులు నీటిని విడుదల చేయాల్సి ఉంది. అదే సామర్థ్యం లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యంతో హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి జలాశయంలోకి నీటిని విడుదల చేసేలా తూము (ఇన్‌లెట్ స్లూయిస్) ఏర్పాటు చేయాల్సి ఉంది.

అదనపు తూము ఏర్పాటుకు

పత్తికొండ జలాశయం ఇన్‌లెట్ సామర్థ్యం 428 క్యూసెక్కులు (12.14 క్యుమెక్స్)కు డిజైన్ చేశారు. ఆయకట్టు రైతులకు కన్నీటి కష్టాలు తప్పవు. కుడి, ఎడమల కాలువల సామర్థ్యం 816 క్యూసెక్కులకు సమానంగా నీటిని తీసుకోవడానికి వీలుగా ప్రస్తుతం ఉన్న ఇన్‌లెట్ పక్కనే 388 క్యూసెక్కులు (10.99 క్యుమెక్స్) సామర్థ్యంతో మరో అదనపు తూము (అడిషినల్ ఇన్‌లెట్) ఏర్పాటుకు ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపారు. హంద్రీనీవా కాలువ విస్తరణలో భాగంగా ఈ అదనపు తూము కూడా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

మిగతా 6వ పేజీలో

మూసేసారూ..!

- బడులు తెరిపించాలంటున్న తల్లిదండ్రులు
- విద్యార్థులు లేరంటున్న అధికారులు
- తప్పనిసరి పరిస్థితుల్లో 'ప్రైవేటు' బాట


డి రంగాపురంలో మూతబడిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

ప్యాపిలి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు మూత పడ్డాయి. ఈ పాఠశాలల మూసేయడంతో ఆ గ్రామాల్లో బడి గంట శబ్ధం, పిల్లల సందడి కనుమరుగయ్యాయి. విద్యార్థుల చదువులు దెబ్బతింటుండటంతో తల్లిదండ్రుల ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మండలంలోని పెద్దపాయి, రాంపురం, రాచవాండ్లపల్లి, డి రంగాపురం, ఎర్రగుంట్లపల్లి, హెచ్‌ఆర్‌పల్లి, కౌలపల్లి గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో దాదాపు 30మంది విద్యార్థులు ఉండేవారు. ఐదేళ్ల క్రితం ఈ పాఠశాలలను అధికారులు మూసేశారు. దీంతో ఆ గ్రామాల పిల్లలు ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవలసిన పరిస్థితులు నెలకొన్నాయి. విద్యాశాఖ అధికారులు మాత్రం తల్లిదండ్రులు పిల్లలను ప్రైవేటు స్కూళ్లలో చేర్పించడంతో ఆ గ్రామాల్లోని పిల్లల సంఖ్య తక్కువగా ఉండటంతోనే బడులను మూసివేయాల్సి వచ్చిందని చెబుతున్నారు.

బడులను తెరిపిస్తే పిల్లలను చేర్పిస్తాం

తమ గ్రామాల్లో పనిచేసే ఉపాధ్యాయులు సక్రమంగా విధులకు రాకపోవడంతో పిల్లల చదువులు దెబ్బతిన్నాయి. దీంతో పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించాల్సి వస్తుందని ఎర్రగుంట్లపల్లి, రాంపురం, హెచ్‌ఆర్‌పల్లి, కౌలపల్లి గ్రామాల ప్రజలు తెలియజేస్తున్నారు. పాఠశాలలను తెరిచి ఉపాధ్యాయులు సక్రమంగా విధులు నిర్వహిస్తే పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పిస్తామని పిల్లల తల్లిదండ్రులు చెబుతున్నారు.

ఫీజులు కట్టలేకపోతున్నాం



తమ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను మూసేశారు. దీంతో ప్యాపిలి, డోన్ ప్రాంతాల్లోని ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలను చేర్పించాం. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు అధికంగా ఉండటంతో కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. గ్రామంలో పాఠశాలను ప్రారంభిస్తే ఇక్కడే పిల్లలను చేర్పించడానికి తల్లిదండ్రులు సిద్ధంగా ఉన్నారు.
- బాలక్రిష్ణ, ఎర్రగుంట్లపల్లి, ప్యాపిలి మండలం

పారదర్శక విధానాలను అమలు చేయండి

● కలెక్టర్ రాజకుమారి


పర్యవేక్షణా బృందంతో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు చేర్చేందుకు పారదర్శక విధానాలను అమలు చేయాలని జిల్లా అధికారులకు కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో కేంద్ర ప్రభుత్వ నిధుల సహకారంతో అమలవుతున్న పథకాల పటిష్ఠ అమలుపై జాతీయ పర్యవేక్షణా బృందం సమక్షంలో జిల్లా అధికారులతో కలెక్టర్ చర్చించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో ఆయాశాఖల ద్వారా అమలవుతున్న వివిధ పథకాలను పరిశీలించేందుకు జాతీయస్థాయి పర్యవేక్షణా బృందం లీడర్ సంతోష్‌ఫరీదా నేతృత్వంలో ఈనెల 19వ తేదీ నుంచి 29వ తేదీ వరకు జిల్లాలో పర్యటించారు. బృందం సభ్యులు జిల్లాలోని ఉయ్యాలవాడ, జూపాడుబంగ్లా, నంద్యాల మండలాల్లో పర్యటించి కేంద్ర పథకాల కింద అమలవుతున్న పథకాలను పరిశీలించారు. వాటిలో గుర్తించిన విధానపరమైన అంశాలను కలెక్టర్ సమక్షంలో అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా పథకాలను లబ్ధిదారులకు చేర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎన్‌ఎల్‌ఎం లీడర్ సంతోష్ ఫరీదా, సభ్యులు సూర్యప్రధాన్, డ్వామా పీడీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఇలాగైతే ఎలా?



ఎడమ కాలువకు నీటిని విడుదల చేసే తూము దుస్థితి

5వ పేజీ తరువాయి

శ్రీశైలానికి వరద రావడం, కాలువకు నీటిని విడుదల చేయడం జరిగిపోయింది. దీంతో అదనపు తూము నిర్మాణం కోసం మరో ఏడాది ఆగక తప్పని పరిస్థితి.

అసంపూర్తిగా జలాశయం పనులు

పత్తికొండ జలాశయం సామర్థ్యం 1.126 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.85 టీఎంసీలు కూడా నిల్వ చేసుకోలేని పరిస్థితి ఉంది. ప్రధాన కారణం రిజర్వాయర్ స్టోన్ రివిట్‌మెంట్ (రాతిపరుపు), సర్‌ప్లస్ కోర్ (కడతూము దిగువ భాగం), జలాశయం ఆనకట్ట బయట వైపు డ్రైన్స్ ప్యారాపెట్ వాల్.. వంటి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వీటిని పూర్తి చేయాలంటే సుమారు రూ.40-50 కోట్లు నిధులు అవసరం ఉంది. అలాగే కుడి, ఎడమ కాలువలు, పంట కాలువలు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ పనులకు రూ.210 కోట్లు నిధులు అవసరమని ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపారు.

అదనపు ఇన్‌లెట్ నిర్మాణం చేపడుతాం



హంద్రీనీవా ప్రాజెక్టులో భాగంగా 1.126 టీఎంసీల సామర్థ్యంతో పత్తికొండ (పందికోన) జలాశయం నిర్మించారు. కుడి, ఎడమ కాలువల సామర్థ్యం 816 క్యూసెక్కులు కాగా, ప్రధాన కాలువ నుంచి జలాశయానికి నీటిని మళ్లించే ఇన్‌లెట్ సామర్థ్యం 388 క్యూసెక్కులు తక్కువగా ఉంది. అందుకు సరిపడ అదనపు ఇన్‌లెట్ తూము నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వచ్చే ఏడాదిలోగా పనులు పూర్తి చేసి, రాబోయే ఖరీఫ్‌లో పూర్తి సామర్థ్యం 816 క్యూసెక్కులు విడుదల చేసేందుకు ఇన్‌లెట్స్ సిద్ధం చేస్తాం. కుడి, ఎడమ కాలువ అసంపూర్తి పనులు కూడా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

● పాండురంగయ్య, ఎస్ఈ, హంద్రీనీవా ప్రాజెక్టు సర్కిల్-1, కర్నూలు

ఇసుకాసురులు



ఓర్వకల్లు జగనన్న కాలనీలో నిల్వ ఉన్న అక్రమ ఇసుక

ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఇసుకాసురులు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. ఇసుకను అనుమతుల్లేకుండా అక్రమ రవాణా సాగిస్తూ లక్షల్లో దోచుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న విమర్శలున్నాయి. ట్రాక్టరు ఇసుకకు వేలల్లో వసూలు చేస్తుండటంతో ఇంటి నిర్మాణదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- అధికారులకు ముడుపులు
- రూ.లక్షల్లో జేబులు నింపుకుంటున్న వ్యాపారులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

ఓర్వకల్లు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఇసుకాసురులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఇసుక అక్రమ రవాణాపై కఠినచర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించినా క్షేత్రస్థాయిలో పట్టించుకున్న దాఖలాలు లేవు. అధికారులు ఇసుక అక్రమ రవాణాను చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండటంతో వ్యాపారులు రెచ్చిపోతున్నారు. ఓర్వకల్లు మండలానికి కర్నూలు పాయింట్ నుంచి ఈర్లదిన్నె, ముడుముల, సింగోరం, తదితర ప్రాంతాల నుంచి ఓర్వకల్లుకు టిప్పర్ల ద్వారా ఇసుకను వ్యాపారులు తరలిస్తున్నారు. ఇక్కడి నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తూ వ్యాపారులు రూ.లక్షల్లో జేబులు నింపుకుంటున్నారని ఆయా గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న విమర్శలున్నాయి. అక్రమార్కులు ఓర్వకల్లు, హుశేనాపురం ప్రాంతాల్లో ఇసుకను నిల్వచేసి మండలానికి అంతా ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ట్రాక్టరు ఇసుక రూ.6వేల నుంచి రూ.7వేల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం



బైరెడ్డి కాలనీలో ఇసుకను ట్రాక్టరులో వేస్తున్న కూలీలు

దళారీ వ్యవస్థను తరిమికొట్టండి



కర్నూలు పాయింట్ నుంచి ఓర్వకల్లుకు ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. ఇసుకను ఆసరాగా చేసుకుని దళారులు రూ.లక్షల్లో డబ్బులు సంపాదించి జేబులు నింపుకుంటున్నారు. దళారీ వ్యవస్థను అధికారులు కట్టడిచేసి కఠినంగా శిక్షించాలి ● శ్రీధర్, సీఐటీయూ జిల్లా నాయకుడు

రాత్రింబవళ్లు తరలిస్తున్నారనే..

ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని పదేపదే చెబుతున్నారు. అయినా కర్నూలు పాయింట్ నుంచి ఓర్వకల్లుకు ఇసుక అక్రమ రవాణా రాత్రింబవళ్లు కొనసాగుతూనే ఉంది. ఈ ఇసుక రవాణా ఎలా జరుగుతుంది అనే కోణంలో సంబంధిత ఉన్నతాధికారులు దర్యాప్తు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే.. ట్రాక్టరు ఇసుక వేలల్లో వసూలు చేస్తుండటంతో ఇంటి నిర్మాణదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఓర్వకల్లుకు చేరుకున్న ఇసుక లారీ

అధికారులు పట్టించుకోకపోవడం..



ఈర్లదిన్నె, ముడుమాల, సింగోరం, తదితర ప్రాంతాల నుంచి ఓర్వకల్లుకు పగలు రాత్రి అనే తేడా లేకుండా టిప్పర్లతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా కూడా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు.

● రమేష్, సీపీఐ నాయకుడు

కఠిన చర్యలు తీసుకుంటాం



ఓర్వకల్లుకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. ఎవరైన ఇసుక అక్రమ తరలింపునకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. మండలంలో ఎవరైన ఇసుక అక్రమ రవాణా చేస్తే తమ దృష్టికి తీసుకురావాలి.

● విద్యాసాగర్, తహసీల్దార్, ఓర్వకల్లు

విద్యార్థికి అభినందనలు

జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు మహ్మద్‌వలి ఎంపిక



మహ్మద్ వలిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరు జూలై 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నీలకంఠేశ్వర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి మహ్మద్‌వలి జాతీయ స్థాయిలో జరిగే వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. మంగళవారం పాఠశాలలో విద్యార్థి మహ్మద్‌వలిని హెచ్ఎం శోభారాణి, పీఈటీలు వెంకటేశ్, బసబ రాజు, సృజనను అభినందించారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వలి ఈనెల 26, 27తేదీల్లో విజయవాడ ఔట్‌డోర్ స్టేడియంలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 72 కేజీల విభాగంలో తన వ్యక్తిగత ప్రతిభను చాటి ప్రథమ బహుమతిని సాధించాడు. జార్ఖండ్ రాష్ట్రంలో ఆగస్టు నెల 19, 20, 21తేదీల్లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహబూబ్ బాషా, తిమ్మప్ప, కరే కృష్ణ, భీమేష్, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

టీజీవీ కల్చరల్ అకాడమీకి రెండు జాతీయ బహుమతులు



బహుమతులు అందుకుంటున్న టీజీవీ కల్చరల్ అకాడమీ దర్శకుడు వీవీ రమణారెడ్డి, కళాకారులు

కర్నూలు కల్చరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని అభినయ ఆర్ట్స్ సంస్థ ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ఈనెల 20 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ స్థాయి పౌరాణిక పద్య నాటక పోటీలు నిర్వహించారు. ఈ నాటక పోటీల్లో చివరి రోజున కర్నూలు టీజీవీ కల్చరల్ అకాడమీ కళాకారులు ప్రదర్శించిన 'శ్రీ వేంకటేశ్వర మహాత్యం' భక్తిరస పద్య నాటకానికి రెండు జాతీయ స్థాయి బహుమతులు లభించాయి. ఈ బహుమతుల్లో ఈ నాటకంలో అనంతాచార్య పాత్రధారి జె.మోహన్‌నాయక్‌కు ఒకటి, నాటకంలో బాల వెంకటేశ్వర స్వామి పాత్రధారి సురభి యశోధర్‌లకు మరో బహుమతి లభించినట్లు నాటక దర్శకుడు, టీజీవీ కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు వీవీ రమణారెడ్డి మంగళవారం తెలిపారు. జాతీయ బహుమతులు సాధించిన కళాకారులను, నాటక దర్శకుడిని నగరానికి చెందిన పలువురు కళాకారులు అభినందించారు.

నవోదయ దరఖాస్తు గడువు పెంపు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతులకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాల్సిన గడువు పెంచినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ 2026-27వ విద్యాసంవత్సరానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతామన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఉమ్మడి కర్నూలు జిల్లా వాసులై ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తును ఆగస్టు 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 07-02-2025 శనివారం రోజున ఎంపిక పరీక్ష ఉంటుందన్నారు. అలాగే అభ్యర్థులు 2025-26వ సంవత్సరంలో 10వ తరగతి పూర్తిచేసి ఉండాలన్నారు. వివరాలకు 08512-294545 నంబర్‌ను కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

కళాశాలల్లో పెరిగిన విద్యార్థుల సంఖ్య

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఈఏడాది ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని కడప ఆర్జేడీ డా.సురేష్‌బాబు పేర్కొన్నారు. స్థానిక టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాళ్ల సమావేశాన్ని ఆర్ఐవో జి.లాలెప్ప అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఫస్టియర్‌లో ప్రభుత్వం ప్రవేశపెట్టన సంస్కరణలలో భాగంగా సిలబస్‌లో మార్పులు, అడిషినల్ సబ్జెక్టుల పేరుతో కొత్త కాంబినేషన్లకు అవకాశం ఇచ్చారన్నారు. గణితం-ఎ, బీ పేపరు రెండింటిని కలిపి ఒకే పేపర్‌గానూ, బోటనీ, జువాలజీ సబ్జెక్టులను కలిపి బయాలజీగా ప్రవేశపెట్టారన్నారు. ఈ నూతన సంస్కరణలపై అన్ని జూనియర్ కళాశాలల మేనేజ్‌మెంట్లు, ప్రిన్సిపాల్స్ స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆర్ఐవో లాలెప్ప, ఏజీఎంవో సుంకన్న, ప్రిన్సిపాల్ పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌గా పదోన్నతి

30 ఏళ్ల తర్వాత అవకాశం



విజయకుమార్

కర్నూలు, జూలై 29(ఆంధ్రజ్యోతి): జల వనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఆఫీసులో సీనియర్ స్టెనోగ్రాఫర్‌గా పని చేస్తున్న విజయకుమార్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందారు. మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 1993లో స్టెనోగా చేరిన ఆయన 1995 వర కు పార్లమెంటు కార్మిక శాఖ, కర్మాగారాల శాఖ స్టెనోగ్రాఫర్‌గా పని చేశారు. అప్పటి మంత్రులు పరిటాల రవీంద్ర, తలసాని శ్రీనివాస్ యాదవ్ పేషీలలో 1995 నుంచి 2004 వరకు పనిచేశారు. ఆ తర్వాత నీటి పారుదల శాఖకు బదిలీ అయ్యారు. అప్పటినుంచి కర్నూలు జలవనరుల శాఖ సర్కిల్ ఆఫీసులో స్టెనోగ్రాఫర్‌గా, సీనియర్ స్టెనోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. 30 ఏళ్ల తర్వాత ఆఫీసు సూపరింటెండెంట్‌గా పదోన్నతి వచ్చింది. 2009లో వరద పోటెత్తిన సమయంలో ఆయన చేసిన సేవలకు ప్రభుత్వం నుంచి ప్రశంసలు అందుకున్నారు. పదోన్నతి పొందిన విజయకుమార్‌ను ఎస్ఈ బాలచంద్రా రెడ్డి, సిబ్బంది అభినందించారు.

ట్యాంకర్లతో తెచ్చి.. నీటిని స్ప్రే చేస్తూ



నీటిని స్ప్రే చేస్తున్న దృశ్యం



చిన్నగిడ్డయ్య, గోరంట్ల

ఖరీఫ్ ఆరంభంలో అనుకూలించిన వర్షాలు రెండు వారాలుగా ముఖం చాటేశాయి. ఉల్లి నాటుకున్న రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. పది రోజులుగా వర్షం లేకపోవడం, పైగా గాలుల ప్రభావంతో భూమిలో తేమశాతం తగ్గిపోయింది. ఉల్లికాడలు వాడిపోయి ఎండు దశకు చేరుకుంటున్నాయి. ఈరోజైనా వర్షం రాకపోతుందా అని అన్నదాతలు ఆకాశం వైపు ఎదురుచూస్తున్నా నిరాశే ఎదురవుతోంది. దీంతో మంగళవారం గోరంట్లకు చెందిన చిన్నగిడ్డయ్య అనే రైతు ట్యాంకర్లతో నీటిని తెచ్చి రెండెకరాల్లో సాగు చేసిన ఉల్లిపంటకు నీటిని స్ప్రే చేయించాడు. రెండెకరాలకు మూడు ట్యాంకర్ల నీటిని తరలించడానికి రూ.4500, పంపు స్ప్రే చేయడం కోసం ఇద్దరు కూలీలకు రూ.వెయ్యి ఖర్చు అయ్యింది. ప్రస్తుతం మొక్కకు తడి అందిస్తే చాలునని, రెండు మూడు రోజుల్లో వర్షం రాకపోతుందా అన్న నమ్మకాన్ని రైతు వెలిబుచ్చాడు.

● కోడుమూరు రూరల్, ఆంధ్రజ్యోతి



పొలం వద్ద నీటి ట్యాంకరు

వచ్చారు.. ముగించారు..!

- ఎనిమిది నిమిషాల్లో ముగిసిన కౌన్సిల్ సమావేశం
- రెండు వర్గాలు చెరోసారి నిర్వహణ
- నలిగిపోతున్న అధికారులు
- చైర్మన్‌కు అవినీతిని ప్రశ్నిస్తారన్న భయం పట్టుకుంది
- కో-ఆప్షన్ మెంబర్ శ్రీనివాసరెడ్డి



11.27 గంటలకు సమావేశానికి హాజరవుతున్న చైర్మన్, ఎంపీ వర్గం కౌన్సిలర్లు

నందికొట్కూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని చైర్మన్ ఇలా వచ్చి.. అలా ముగించుకు వెళ్లారు. మంగళవారం సమావేశం ప్రారంభమైన ఎనిమిది నిమిషాల్లో చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్ని సర్దేసి బయటపడ్డారు. ఆయన సమావేశం ముగించాక ఎమ్మెల్యే వర్గం కౌన్సిలర్లు సమావేశానికి వచ్చి అధికారులతో మరోసారి నిర్వహించారు. ఒకే సమావేశాన్ని రెండు వర్గాలు చెరొకసారి నిర్వహించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. రెండు వర్గాల మధ్య అధికారులు నలిగిపోతున్నారు. సాధారణంగా చైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశంలో ముగిశాక అధికారులు కూడా అక్కడి నుంచి వెళ్లిపోవాల్సి ఉందని కౌన్సిలర్లు చెబుతున్నారు. కాని ఎమ్మెల్యే వర్గం కౌన్సిలర్లు ఆలస్యంగా రావడంతో వారు అడిగిన ప్రశ్నలకు కమిషనర్ బేబి సమాధానం చెప్పే ప్రయత్నించారు. చైర్మన్ సభను ముగించాక మీరు ఎలా కొనసాగిస్తారని చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి కమిషనర్‌ను ప్రశ్నించారు. దీంతో రెండు వర్గాల మధ్య నందికొట్కూరు మున్సిపల్ కార్యాలయ అధికారులు నలిగిపోతున్నారు.

అధికారుల పడిగాపులు

ఉదయం 11గంటలకు ప్రారంభం కావాల్సిన కౌన్సిల్ సమావేశానికి అధికారులు 10.45 గంటలకే హాజరయ్యారు. నాయకుల కోసం 45 నిమిషాలు వేచి చూసిన తర్వాత చైర్మన్‌తో పాటు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వర్గం కౌన్సిలర్లు, వైసీపీ కౌన్సిలర్లు మొత్తం తొమ్మిది మంది 11.34 గంటలకు చేరుకున్నారు. ఎమ్మెల్యే వర్గానికి చెందిన ఇద్దరు మహిళా కౌన్సిలర్లు కూడా హాజరయ్యారు. సభను నిర్వహించడానికి మూడో వంతు మెజార్టీ ఉండడంతో సభను నిర్వహించవచ్చని కమిషనర్ బేబి చైర్మన్‌కు సూచించడంతో సభను ప్రారంభించారు. ఎనిమిది నిమిషాల్లో సమావేశాన్ని చైర్మన్ ముగించి వెళ్లి పోయారు.

ఎవరికి వారుగా నిర్వహణ

మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని ఎవరికి వారుగా నిర్వహించుకున్నారు. ముందుగా ఈ సమావేశం ఉదయం 11.00 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా 11.34 గంటలకు ప్రారంభమై అధికారులు అజెండా చదవగానే ఆమోదం తెలిపి 11.42గంటలకు సభను చైర్మన్ ముగించారు. ఆ తర్వాత 11.44 గంటలకు ఎమ్మెల్యే జయసూర్య వర్గం కౌన్సిలర్లు సమావేశానికి వచ్చారు. అవినీతిని ప్రశ్నిస్తామనే భయంతోనే సమావేశాన్ని త్వరగా ముగించుకొని వెళ్లారని కోఆప్షన్ మెంబర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మీరు వస్తున్నారని చెబితే చైర్మన్‌ను రిక్వెస్ట్ చేసేవారమని కమిషనర్ బేబి తెలిపారు. నిబంధనల ప్రకారం సభ ప్రారంభమైనప్పటి నుంచి గంట వరకు సమయం ఉంటుందని, ఆవిషయాన్ని కూడా చైర్మన్ గుర్తించకపోవడం ఏమిటని 2వ వార్డు కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్ ప్రశ్నించారు.

కాలయాపన చేయడం ఏమిటి?


చైర్మన్‌ను నిలదీయాలనుకున్న ఎమ్మెల్యే వర్గం కౌన్సిలర్లు సమయానికి సమావేశానికి రావాలి. కానీ కమిషనర్ రూంలో కూర్చొని కాలయాపన చేయడం ఏమిటని సభ అనంతరం ఎంపీ వర్గం కౌన్సిలర్లు ఆరోపించారు. సభకు హాజరైన ఎమ్మెల్యే వర్గానికి చెందిన ఇద్దరు మహిళా కౌన్సిలర్లను వెనక్కి ఎందుకు పిలిపించుకున్నారని వారు ప్రశ్నించారు. సొంత అజెండాలతో సమావేశాలకు ఎంపీ, ఎమ్మెల్యే వర్గాల కౌన్సిలర్లు ఎవరికి వారుగా హాజరవుతూ సభను గందరగోళం చేయడం తప్ప ప్రజా సమస్యల పరిష్కారం కోసం సభను నిర్వహించడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ప్రతిపాదనలను చైర్మన్ ఆమోదం తెలిపారా?

గత సమావేశంలో మెజార్టీ కౌన్సిలర్లు ప్రతిపాదించిన ప్రతిపాదనలను చైర్మన్ ఆమోదం తెలిపారా లేదా అని కమిషనర్ బేబిని కౌన్సిలర్లు ప్రశ్నించారు. ఆమోదం తెలపలేదని ఆమె తెలపడంతో మినిట్స్ బుక్ ఎందుకు మెయింటెన్ చేయడం లేదని జాకీర్ ప్రశ్నించారు. నాలుగేళ్లుగా అధికారులకు తాము పదేపదే చెబుతున్నా కూడా మినిట్స్ బుక్కును మెయింటెన్ చేయడం లేదన్నారు. దీనివల్ల అజెండాలో ఆమోదం పొందిన వాటికి బదులు తమకు ఇష్టం వచ్చిన పనులను మినిస్ట్ బుక్కులో తర్వాత చేర్చుకొని ఆమోదం తెలుపుకుంటున్నారన్నారు. ప్రజల నుంచి పన్నుల రూపంలో ఎంత సొమ్ము వసూళ్ల చేస్తున్నాం... ఎంత ఖర్చు చేస్తున్నామని ఆయన అధికారులను ప్రశ్నించారు.

పలు శాఖ అధికారులు గైర్హాజరు

కౌన్సిల్ సమావేశానికి మున్సిపల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది, ఐసీడీఎస్, హౌసింగ్ శాఖ సంబంధిత అధికారులు మినహా ఇతర ఏఒక్క శాఖ అధికారులు కూడా సభకు హాజరు కాలేదు. దీంతో పట్టణ ప్రజల సమస్యలపై ఏ పాటి చిత్తశుద్ధి ఉందో ఇట్టే అర్థమౌతోంది.



11.42 గంటలకు సమావేశాన్ని ముగించుకుని వెళ్తున్న చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి




11.44 గంటలకు సమావేశానికి హాజరవుతున్న ఎమ్మెల్యే వర్గం కౌన్సిలర్లు

ఆపరేషన్ టీ132ఎఫ్

(5వ పేజీ తరువాయి)

మళ్లీ కచ్చితమైన ప్రదేశంలోకి పెద్దపులి వస్తుందని భావించిన అటవీ అధికారులు మూడు బృందాలను అక్కడ అప్రమత్తం చేశారు. 6వ తేదీ తెల్లవారుజామున 5:17 గంటలకు పెద్దపులి ఆవుదూడ కళేబరం వద్దకు రాగానే ట్రాంక్ లైజర్ గన్‌తో పులికి మత్తు ఇచ్చారు. దీంతో అక్కడి నుంచి పరారైన పులి 5:40గంటలకు మత్తులోకి వెళ్లింది. అప్పటికే డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచడంతో పులిని గుర్తించి బ్యాక్ అండ్ టీం సహకారంతో బైర్లూటి వైల్డ్‌లైఫ్ డిస్పెన్సరీకి తీసుకొచ్చి ఎన్ఎస్‌టీఆర్ వైల్డ్‌లైఫ్ డాక్టర్లు జుబేర్‌వలి, ఆరన్ వెస్లీ నేతృత్వంలో ప్రాథమిక చికిత్సలు అందించారు. ఆ తర్వాత ఎనిమల్ ట్రాన్స్‌పోర్ట్ వెహికల్‌లో దాన్ని తిరుపతి ఎస్వీ జూపార్క్‌కు తరలించారు. మెడభాగంలో తీవ్రంగా గాయపడిన పులికి 7వ తేదీన తిరుపతి జూపార్క్ డిస్పెన్సరీలో వైద్యనిపుణులు శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం జూపార్క్‌లోని ఎనిమల్ రెస్క్యూ సెంటర్‌లో పులికి సపర్యలు అందిస్తున్నారు. గాయపడిన పులి పూర్తి ఆరోగ్యవంతంగా ఉన్నట్లయితే తిరిగి దాన్ని నల్లమలలో వదిలేయాలని అటవీ అధికారులు భావిస్తున్నారు.



పులికి ఎరగా చెట్టుకు కట్టి ఉంచిన దూడ(ఫైల్)





పాదముద్రలను పరిశీలిస్తున్న అధికారులు



పులిని తరలిస్తున్న సిబ్బంది

పులిని రక్షించాలన్న తపనతో పనిచేశాం



ఉచ్చుకి చిక్కి తప్పించుకుని గాయపడిన పులిని ఎలాగైనా రక్షించాలన్న తపనతో 21 రోజుల పాటు ధైర్యసాహసాలతో రాత్రింబవళ్లు పనిచేశాం. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎన్‌టీసీఏ ఆలోచనల మేరకు ఎట్టకేలకు అతికష్టం మీద పులిని బంధించాం. ఇక్కడే చికిత్సలు అందించడం కష్టతరమని భావించి వెంటనే తిరుపతి ఎస్వీ జూపార్క్‌కు తరలించాం. అక్కడి జూపార్క్ వైద్యులు విజయవంతంగా ఆపరేషన్ పూర్తి చేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. పులి ఆరోగ్యం పూర్తిగా కుదుటపడితే దాన్ని తిరిగి నల్లమలలో వదిలేయాలన్న ఆలోచనలో ఉన్నాం. ఈ రెస్క్యూ ఆపరేషన్ అన్ని బృందాలుగా బాధ్యతగా పని చేయడం వల్లే విజయం సాధించాం. ఈ ఆపరేషన్ ఎన్ఎస్‌టీఆర్‌లో అరుదైన ఘటన కావడంతోనే వరల్డ్ టైగర్ డే సందర్భంగా ప్రత్యేక వీడియో డాక్యుమెంటరీని రూపొందించాం.

వి.సాయిబాబా, డిప్యూటీ డైరెక్టర్, ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్

తుంగభద్ర నదిలో మొసలి కలకలం

మంత్రాలయం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలోని తుంగభద్ర నది గణేష్ ఘాట్ వద్ద మంగళవారం ఓ మొసలి కనిపించింది. ఆ స్నానఘట్టం వద్ద ప్రజలు స్నానం చేయడం, బట్టలు ఉతకడం వంటివి చేస్తుండగా నదిలో మొసలి కనిపించడంతో భయభ్రాంతులకు గురయ్యారు. మొసలి ఒడ్డుకు చేరే ప్రయత్నం చేస్తుంది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు మొసలిని పట్టుకోవడమో.. లేదా ఏదైనా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రీనగర్‌లో విధులు నిర్వహిస్తూ..

- గుండెపోటుతో వీరజవాన్ మృతి



అశోక్(ఫైల్)

చాగలమర్రి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవంగలి గ్రామానికి చెందిన అశోక్ (26) సీఆర్పీఎఫ్ జవాన్‌గా జమ్మూ కశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి శ్రీనగర్‌లో గుండెపోటుతో మృతి చెందారు. అశోక్ ఆర్మీలో ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తూ దేశ రక్షణ కోసం అహర్నిశలు పాటుపడుతూ చివరకు ప్రాణాలు కోల్పోయారు. అతడి తండ్రి శేఖర్ కూడా ఆర్మీలో ఆర్మీలో పీఎస్ఎఫ్ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అశోక్ అకాల మరణంతో ఆ కుటుంబంలో విషాద చాయలు అలుముకున్నాయి. వీర జవాన్ మృతితో యువకులు బుధవారం చాగలమర్రి టోల్‌ప్లాజా నుంచి పెద్దవంగలి గ్రామం వరకు శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నట్లు యూత్ సభ్యులు పేర్కొన్నారు. వీరసైనికుడి మరణాన్ని జీర్ణించుకోలేక పోతున్నామని కర్నూలు జైజవాన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు రామకృష్ణ పేర్కొన్నారు. అశోక్ కుటుంబానికి సంతాపం ప్రకటించారు.

కడుపునొప్పి తాళలేక..

- పురుగుమందు తాగి వ్యక్తి బలవన్మరణం



నరసింహులు(ఫైల్)

గోనెగండ్ల, జూలై 29(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక పురుగుమందు తాగి ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని గంజహళ్లి గ్రామంలో చోటుచేసుకున్నట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన బోయ నరసింహులు(50)కు భార్య మీనాక్షి, ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరు వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కొన్ని నెలలుగా నరసింహులుకి కడుపునొప్పి ఉండేది. కుటుంబ సభ్యులు పలు చోట్ల వైద్యం చేయించినా తగ్గలేదు. సోమవారం మధ్యాహ్నం తీవ్ర కడుపునొప్పి రాగా వైద్యుల వద్ద చూపించినా తగ్గలేదు. దీంతో జీవితంపై విరక్తి అతడు పురుగు మందు తాగాడు. గమనించిన కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కొలుకోలేక మంగళవారం మృతి చెందాడు. భార్య మీనాక్షి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వేటకొడవలితో వ్యక్తిపై దాడి

ఎమ్మిగనూరు రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తిపై వేటకొడవలితో దాడిచేశాడు. ఈఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకు న్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు.. కోడుమూరు పట్టణానికి చెందిన ఎరుకలి కృష్ణ, బోయ రాగూర్ కలిసి గోనెగండ్లలో మద్యం తీసుకున్నారు. మద్యం తాగేందుకు గోనెగండ్ల సమీపంలోని బాట మారెమ్మవ్వ దేవాలయం సమీపంలోని కాలువగట్టుపైకి వచ్చారు. మద్యం తాగిన తర్వాత బోయ రాగూర్ ఎరుకలి కృష్ణను ఎందుకు తన తల్లిని తిట్టావని గొడవకు దిగాడు. ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. ఎరుకల కృష్ణపై రాగూర్ వేటకొడవలితో దాడి చేశాడు. దీంతో అతడి తలకు, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రాణభయంతో కృష్ణ పక్కలో ఉన్న పొలాల్లో తలదాచుకున్నాడు. దీన్ని గమనించిన స్థానికులు ఎమ్మిగనూరు రూరల్ పోలీసులకు సమాచారం అందజేశారు. అక్కడికి చేరుకున్న సీఐ, ఎస్ఐలు రాత్రంతా గాలించారు. తెల్లవారుజామున 5గంటలకు రోడ్డు పక్కలో పడి ఉన్న ఎరుకలి కృష్ణను గుర్తించి చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

సారా విక్రేతపై పీడీ యాక్ట్

- కడప సెంట్రల్ జైలుకు తరలింపు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ

నంద్యాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో సారా కేసుల్లో నిందితుడైన ఓ విక్రేతపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఏకంగా పీడీ యాక్ట్‌ను నమోదు జైలుకు పంపింది. పాణ్యం మండలం కేంద్రంలోని ఏఆర్ కాలనీకి చెందిన కాశన్న కుమారుడు మాణిపాటి రాజు 2022 నుంచి సారా తయారీ చేయడంతో పాటు విక్రయాలు చేశారు. దీంతో ఎక్సైజ్ పోలీసులు నాలుగు కేసులు కూడా నమోదు చేశారు. అయితే కలెక్టర్ రాజకుమారి ఈ నెల 24వ తేదీన సదరు విక్రేతపై పీడీయాక్ట్ నమోదు చేసి ప్రభుత్వానికి తగిన సమగ్ర నివేదికను అందజేశారు. ఈ నేపథ్యంలో నివేదిక ఆధారంగా ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్ ముందస్తు నిర్బంధ చట్టం 1986 ప్రకారం రాజుపై పీడీయాక్ట్‌ను అమోదిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ అనుమతితో ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, సీఐ కృష్ణమూర్తి సిబ్బంది కడప సెంట్రల్ జైలుకు తరలించారు. ఎవరైనా సారా తయారీ, విక్రయాలు, రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ హెచ్చరించారు. పదేపదే పట్టుబడితే కేసులతో పాటు పీడీయాక్ట్ నమోదు చేసి జైలుకు పంపుతామని తెలియజేశారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



బాలుడిని అప్పగిస్తున్న ఎస్ఐ

గడివేముల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయి గడివేముల బస్టాండులో ఉన్న బాలుడిని వారి బంధువులకు అప్పగించామని ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. దామగట్ల గ్రామానికి చెందిన తొమ్మిదేళ్ల బాలుడు మహేష్ పాఠశాలకు వెళ్తున్నానని ఇంటి వద్ద చెప్పి స్కూల్‌కు వెళ్లకుండా నందికొట్కూరు బస్టాండుకు వచ్చాడు. బంధువుల గ్రామమైన గ్రంధివేములకు వెళ్లేందుకు బస్సు ఎక్కగా గ్రంధివేములలో దిగకుండా గడివేములలో దిగాడు. ఎక్కడికి వెళ్లాలో తెలియక బస్టాండులో ఏడుస్తూ కూర్చున్న బాలుడిని స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ విచారించి బాలుడిని వారి బంధువులకు అప్పగించారు.

రెవెన్యూ సిబ్బందిపై కొరడా

- ఎనిమిది మందికి మెమోలు జారీ చేసిన కమిషనర్



కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): నగరపాలక కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందిపై నూతన కమిషనర్ కొరడా ఝుళిపించారు. విధుల్లో నిర్లక్ష్యం, జవాబు దారీతనంతో పనిచేయకపోవడంతో ఎనిమిది మందికి సోమవారం కమిషనర్ మెమోలు జారీ చేశారు. నగరంలో ఉన్న మున్సిపల్ దుకాణాల అద్దె వివరాలు, వసూలు, బకాయిల వివరాలు, రిపోర్టులు పలుమార్లు అడిగినా ఇవ్వక పోవడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఆఫీసర్ జునైద్ సిబ్బందికి మెమోలు జారీ చేశారు. దీంతో రెవెన్యూ విభాగంలో ప్రక్షాళన మొదలైంది. ఇంతకాలం రెవెన్యూ విభాగంలో ఏమిచేసినా ఎవరూ ఏమి చేయలేరనే ఉద్దేశ్యంతో సిబ్బంది నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరించారు. కమిషనర్ ఒక్కసారి మెమోలు జారీ చేయడంతో ఉలిక్కిపడ్డారు. మెమోలు తీసుకున్న వారిలో ఏ1 క్లర్క్ జి.సోహేల్ అహ్మద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు టి.శ్రీనివాసులు, ఎస్.తిప్పన్న, ఎం.రాజు, ఆర్.రాజు, ఎస్.మన్సూర్‌బాష, పి.భార్గవ్, శివశంకర్‌లు ఉన్నారు. మెమోలు తీసుకున్న రెండురోజుల్లో సరైన వివరణ ఇవ్వకపోతే నిబంధనల ప్రకారం శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని మెమోలో పేర్కొన్నారు.

ఇద్దరిపై అత్యాచారయత్నం

కొలిమిగుండ్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్లాస్టిక్ సామాన్లు అమ్ముకునే ఇద్దరు మహిళలపై ముగ్గురు మద్యం మత్తులో ఉన్న యువకులు అత్యాచారానికి యత్నించిన ఘటన కొలిమిగుండ్ల మండలంలో మంగళవారం వెలుగుచూసింది. అయితే మహిళలు చాకచక్యంగా వ్యవహరించి జీపు నుంచి దూకి పరుగులు తీయడంతో అఘాయిత్యం నుంచి తప్పించుకోగలిగారు. జమ్మలమడుగుకు చెందిన ఇద్దరు మహిళలు, ఓ వృద్ధ మహిళ, 3ఏళ్ల చిన్నారితో కలిసి సోమవారం ప్లాస్టిక్ సామాన్లు అమ్ముకోవడానికి కొలిమిగుండ్ల మండలంలోని గొర్విమానుపల్లెకు వచ్చారు. సాయంత్రం చీకటి పడుతుండగా గొర్విమానుపల్లె నుంచి జమ్మలమడుగుకు బయలుదేరడానికి గ్రామంలోని ప్రధాన రహదారిలో వేచివున్నారు. అదే సమయంలో అల్ట్రాటెక్ పరిశ్రమకు చెందిన ఓ క్యాంపరు(తొట్టి)జీపు అటుగా రావడంతో మహిళలు ఆపారు. తాము బుగ్గకు వస్తామని చెప్పగా అందులో ప్రయాణించే ముగ్గురు యువకులు వారిని ఎక్కించుకున్నారు. జీపు ఎక్కిన తరువాత గోర్విమానుపల్లె నుంచి తుమ్మలపెంట సమీపంలో అప్పటికే మద్యం మత్తులో ఉన్న యువకులు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం మొదలుపెట్టారు. దీంతో తీవ్ర అసౌకర్యానికి గురైన మహిళలు తమకు వాంతులు వచ్చేవిధంగా ఉందని జీపు ఆపితే దిగుతామని చెప్పినా వినలేదు. వారిని అత్యాచారం చేయాలనుకున్న యువకులు జీపును వెనక్కి తిప్పి గనుల్లోకి తీసుకువెళ్లే ప్రయత్నం చేశారు. ప్రమాదాన్ని పసిగట్టిన మహిళలు చిన్న పాపతో కలిసి కిందకు దూకారు. దీంతో వారికి గాయాలు కాగా, అలాగే పరుగులు తీస్తూ ప్రధాన రహదారిపైకి చేరుకుని వాహనాల్లో పెట్నీకోటకు చేరుకున్నారు. స్థానిక ప్రథమ చికిత్సా కేంద్రంలో చికిత్స చేయించుకుని, స్థానికుల ద్వారా కొలిమిగుండ్ల పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని యువకులు, క్యాంపరు వాహనం కోసం ఆరా తీశారు. మరోవైపు జీపులోనే ఉన్న వృద్ధ మహిళను వారు సోమవారం రాత్రి పొద్దుపోయాక కొలిమిగుండ్లలో వదిలి వెళ్లారు. ఈ ఘటన మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాగా ఘటనపై పోలీసులు ఇంకా కేసు నమోదు చేయకపోవడం గమనార్హం.

పేకాటరాయుళ్ల అరెస్టు

పాములపాడు జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బానుముక్కల గ్రామ శివార్లలో పేకాట స్థావరాలపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు వద్ద నుంచి రూ. 62, 400 నగదు, మూడు సెల్‌ఫోన్లు, ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సురేశ్‌బాబు తెలిపారు. బానకచెర్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పేకాట నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆత్మకూరు, ఇస్కాల, పాములపాడుకు, సింగవరం, ఎర్రగూడూరు, వెలుగోడు గ్రామాలకు చెందిన వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. మరో 11 మంది పారిపోయారని తెలిపారు. సిబ్బంది రామేశ్వరయ్య, చెన్నయ్య, ఖాజ, షేక్షావలి ఉన్నారు

లక్ష్యాలను సాధించాలి

- ఆగస్టు 8లోపు డేటా ఎంట్రీని పూర్తిచేయాలి
- కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు కలెక్టరేట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్ ప్రణాళిక అమలులో భాగంగా వివిధ శాఖల పనితీరు సూచికల లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో స్వర్ణాంధ్ర విజన్ ప్లాన్-కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ లక్ష్యాల సాధన అంశాలపై ఆయా శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్ ప్లాన్ అమలులో భాగంగా ప్రతి సంవత్సరం 15 శాతం అభివృద్ధిని సాధించేందుకు వీలుగా ఆయా శాఖల అభివృద్ధి లక్ష్యాలతో కీపెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌ను నిర్దేశించారన్నారు. ఆగస్టు 8వ తేదీలోపు మండల స్థాయి డేటా ఎంట్రీని పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ, సీపీవో హిమప్రభాకర్ రాజు, ఏడీ భారతి పాల్గొన్నారు.

జర్మన్‌భాషపై ఉచిత శిక్షణ

బనగానపల్లె, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నర్సింగ్ కోర్సు చేసిన ఎస్సీ, ఎస్టీ మహిళలకు జర్మనీభాషపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు సహాయ సాంఘిక సంక్షేమ అధికారి నరసింహులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ చేసిన ఎస్సీ, ఎస్టీ మహిళలకు జర్మనీ భాషలో 8 నుంచి 10నెలలపాటు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. 35సంవత్సరాలకు మించకుండా ఉన్న ఎస్సీ, ఎస్టీ మహిళలు ఆధార్‌కార్డు, కుల ధృవీకరణ, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, నర్సింగ్ డిగ్రీ సర్టిఫికెట్, క్లినికల్ అనుభవం గల పత్రం, ఏపీ స్టేట్ నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ పత్రంకలిగి ఉండాలని సూచించారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి కాపీలను నంద్యాల జిల్లా ఎస్సీ సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

'నాలెడ్జ్' సెంటర్ ఏర్పాటుపై వివాదం

- పూర్వ విద్యార్థులు వర్సెస్ వైద్యులు, విద్యార్థులు
- భవనం నిర్మిస్తే అడ్డుకుంటాం
- ప్రభుత్వ వైద్యులసంఘం అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మజీ
- అభ్యంతరాలు ఉంటే సరిదిద్దుకుంటాం
- పూర్వవిద్యార్థుల సంఘం నాయకుడు డాక్టర్ గోవిందరెడ్డి



పూర్వవిద్యార్థుల నాయకులతో వాదిస్తున్న వైద్యులు, విద్యార్థులు



మైదానాన్ని పరిశీలిస్తున్న కాలేజీ వైద్యులు

కర్నూలు హాస్పిటల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కేఎంసీ(కర్నూలు మెడికల్ కాలేజీ)లో నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు వివాదానికి దారి తీసింది. కాలేజీ మైదానంలో కేఎంసీ పూర్వ విద్యార్థులు ఆధ్వర్యంలో నాలెడ్జ్ సెంటర్ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు సోమవారం ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డా.పి.చంద్రశేఖర్ పూర్వ విద్యార్థులతో సమావేశం నిర్వహించి నాలెడ్జ్ సెంటర్‌కు తనవంతు సహకారం అందిస్తానని ప్రకటించారు. మంగళవారం పూర్వవిద్యార్థుల సంఘం నాయకులు ఉదయం తమకు వైస్‌చాన్స్‌లర్ అనుమతి ఇచ్చారని, భవన నిర్మాణానికి కొలతలు తీసుకోవడానికి ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లతో కలిసి మైదానానికి వచ్చారు. నాలెడ్జ్ సెంటర్‌ను 60 సెంట్లతో ఏర్పాటుచేయడానికి మైదానంలో ఎడమవైపు నుంచి కుడి వైపునకు స్థలాన్ని మార్చి కొలతలు తీసుకు న్నారు. ఇంతలో విషయం తెలుసుకున్న ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డా.బ్రహ్మజీ మాస్టర్‌తో పాటు ప్రొఫెసర్లు, వైద్యులు కొందరు జూనియర్ డాక్టర్లు కలిసి పూర్వవిద్యార్థుల ప్రతినిధులతో గొడవకు దిగారు. నాలెడ్జ్ సెంటర్‌ను ఎట్టి పరిస్థితుల్లో గ్రౌండులో అనుమతించేది లేదని డా.బ్రహ్మజీ మాస్టర్, కొంత మంది ప్రొఫెసర్లు కరాఖండిగా తేల్చి చెప్పారు. ప్రిన్సిపాల్ లేనప్పుడు కాలేజీకి ఎలా వస్తారనీ, ఇది సరైంది కాదన్నారు. ఇప్పటికే కాలేజీ గ్రౌండు ఏడు ఎకరాల నుంచి ఐదు ఎకరాలకు కుచించుకుపోయిందని, నాలెడ్జ్ సెంటర్ పేరుతో 60 సెంట్లు స్థలంలో భవనం నిర్మిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు.

ఎవరూ అడ్డుకోలేదు

వీసీ ఆదేశాల మేరకు నాలెడ్జ్ సెంటర్ నిర్మాణానికి సంబంధించి కొలతలు తీసుకోవడానికి మంగళవారం ఉదయం వచ్చామని కేఎంసీ పూర్వ విద్యార్థుల సంఘాల నాయకుడు డాక్టర్ గోవిందరెడ్డి తెలిపారు. తమను ఎవరూ అడ్డుకోలేదని ఈ సెంటర్‌ను కుడి వైపునకు జరిపి కొలతలు తీసుకున్నట్లు తెలిపారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే సరిదిద్దుకుంటామన్నారు. 2021లో నాలెడ్జ్ సెంటర్‌కు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు.


చోరీ కేసులో నిందితుడి అరెస్టు

- ఏడు తులాల బంగారు, 250 గ్రాముల వెండి స్వాధీనం
- అభినందించిన ఎస్పీ

బనగానపల్లె, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇల్లూరుకొత్తపేట గ్రామానికి చెందిన ముల్లా జాఫర్ ఇంటిలో అదే గ్రామానికి చెందిన షేక్ నూర్ అహ్మద్ చోరీకి పాల్పడ్డాడు. నిందితుడి అరెస్ట్ చేసి అతడి వద్ద ఉన్న చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం సీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఇల్లూరు కొత్తపేట గ్రామానికి చెందిన ముల్లా జాఫర్‌హుసేన్ తన ఇంటికి తాళం వేసి వేరే గ్రామానికి వెళ్లారు. ఇది గమనించిన ఇంటి పక్కనే నివాసం ఉండే షేక్ నూర్ అహ్మద్ అతడి ఇంట్లో చొరబడి బీరువా తాళం పగులగొట్టాడు. అందులోని ఏడు తులాల బంగారు ఆభరణాలు, 450 గ్రాముల వెండిని చోరీ చేశాడు. వీటి విలువ రూ.5.10లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు. ముల్లా జాఫర్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ, పోలీసులతో కలిసి వెళ్లి ఘటనాస్థలిని పరిశీలించి సాంకేతికత ఆధారంగా నిందితుడు నూర్ అహ్మద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. రెండు రోజుల్లోనే నిందితుడిని పట్టుకోవడంతో ఎస్పీ అభినందించారన్నారు.

పత్తి పంటపై గడ్డి మందు పిచికారి

ఆదోని రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పత్తి పంటపై కొందరు దుండగులు గడ్డిమందు పిచికారి చేయడంతో పంట దెబ్బతిని రైతుకు దాదాపు రూ.2లక్షల మేర నష్టం వాటిల్లింది. బాధిత రైతు దిబ్బనకల్లు గ్రామానికి చెందిన కురువ గోవిందు తెలిపిన మేరకు.. సర్వే నెం.1బీలో ఎకరా పొలం ఉంది. తన పొలానికి అనుకొని వీరేష్ అనే వ్యక్తికి రెండెకరాల పొలం ఉంది. గత మూడేళ్లుగా గోవిందు వీరేష్ పొలాన్ని గుత్తకు తీసుకున్నాడు. మొత్తం మూడెకరాల్లో పత్తి సాగు చేశాడు. కాగా ఇప్పటికే ఉన్న మనస్పర్థల కారణంగా గ్రామానికి చెందిన కృష్ణారెడ్డితోపాటు మరో ముగ్గురు సోమవారం అర్ధరాత్రి దాటాక పత్తి పంటపై గడ్డిమందు పిచికారి చేయడంతో కళకళలాడే పత్తిపంట మాడిపోయింది. ఈమేరకు మంగళవారం తాలుకా ఎస్ఐ రామాంజనేయులుకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు పంటను పరిశీలించారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ తెలిపారు.



వాడిపోయిన పత్తి పంట



'సూర్యఘర్'ను ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి

బండిఆత్మకూరు జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలో సూర్య ఘర్ యోజన పథకాన్ని అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి అబ్దుల్ రహేమాన్ సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మోడల్‌గా తీసుకున్న నాలుగు గ్రామాలు ఏ కోడూరు, వెంగళరెడ్డిపేట, సంతజూటూరు, ఎర్రగుంట్ల గ్రామాల్లో రేపటి నుంచి ప్రజలకు అవగాహన సమావేశాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ పద్మావతమ్మ, ఎంపీడీవో రామకృష్ణవేణి, ఏఈ కంభగిరి, ఏపీఎం రామశేఖర్‌రెడ్డి, బ్యాంక్ మేనేజర్లు పవన్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు 'సూపర్ సిక్స్' మోసాలు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా

గోస్పాడు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ మోసాలు చేసి అధికారంలోకి వచ్చిందని మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిశోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాబుష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం గోస్పాడులో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్థర్‌సైమన్, మాజీ జెడ్పీటీసీ ప్రహల్లాదరెడ్డి, మాజీ ఎంపీపీ రాజశేఖరరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి: సీఈవో


మాట్లాడుతున్న జడ్పీ సీఈవో

జూపాడుబంగ్లా, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జడ్పీ సీఈవో నాసరరెడ్డి అన్నారు. మండలంలోని తాటిపాడు గ్రామంలో ఆయన పరిసరాలను పరిశీలించారు. చెత్తసేకరణ కార్మికులతో మాట్లాడారు. ఎప్పటికప్పుడు చెత్తను డంపింగ్‌యార్డులకు తరలించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపికృష్ణ, పంచాయతీ కార్యదర్శి తిప్పన్న, సర్పంచ్ లక్ష్మీదేవి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మురుగు కాలువలు నిర్మించాలి

పగిడ్యాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పగిడ్యాల దేవానగర్ కాలనీలో మురుగు కాల్వలు నిర్మించాలని చేయాలని సీపీఎం మండల కన్వీనరు పక్కీర్ సాహెబ్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీ ఎం నాయకులు దేవా నగర్ కాలనీలో పర్యటించి ప్రజల సమస్యల అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మించి ఏళ్ల గడుస్తున్న డ్రైనేజీలు నిర్మించకపోవడంతో మురుగునీరంతా రోడ్లపైనే ప్రవహిస్తుందన్నారు. అధికారులు స్పందించి మురుగు కాల్వలు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉసేనమ్మ, శ్రీనివాసులు, లక్ష్మీదేవి, సువర్ణమ్మ ఉన్నారు.

ప్రతి గ్రామానికి సొసైటీ సేవలు అందించాలి: జేసీ


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సహకార సొసైటీలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రతి గ్రామానికి సొసైటీ సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ అన్నారు. నంద్యాల కలెక్టరేట్‌లో వీసీ హాల్‌లో మంగళవారం జిల్లా కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ సొసైటీలను నాబార్డు, డీసీసీబీలు ఆర్థికంగా సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. పంటలకు అనవసరంగా యూరియా వాడవద్దని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కో ఆపరేటివ్ అధికారి రామాంజనేయులు, నాబార్డు డీడీ ఎం కార్తికేయ, డీసీసీబీ శివలీల, ఫిషరీష్ జేడీ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

నాణ్యత పాటించాలి: డీఈవో



విద్యార్థులతో పాటు భోజనం చేస్తున్న డీఈవో

వెలుగోడు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన పథకంలో మెనూ పాటిస్తూ నాణ్యమైన భోజనం అందించాలని డీఈవో జనార్దన్‌రెడ్డి వంట నిర్వాహకులకు ఆదేశించారు. మంగళవారం వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. పూర్వ విద్యార్థుల సంఘం నాయకులను కలిసి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో బ్రహ్మంనాయక్, ప్రధానోపాధ్యాయులు మాలిక్‌ఖాన్ పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన హాస్టల్ మంజూరు

ఆత్మకూరురూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పీఎంజన్‌మన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం బైర్లూటి గిరిజన గూడెంలో గిరిజన హాస్టల్‌కు నిధులు మంజూరు చేసిందని డీఈవో జనార్దన్‌రెడ్డి అన్నారు. రూ.2.30 లక్షలతో హాస్టల్ పనులను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఈఈ శ్రీనివాసులు,సర్పంచ్ గురువమ్మ,ఏఈ శంకరయ్య, ఎంఈవోలు మేరి మార్గరేట్, అయ్యూబ్ అహ్మద్ పాల్గొన్నారు.

ఆగస్టు 5న విద్యుత్ కార్యాలయాల ఎదుట ధర్నా


మాట్లాడుతున్న బాబురావు

నంద్యాల రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌మీటర్ల ఏర్పాట్లను నిరసిస్తూ ఆగస్టు 5వ తేదీన విద్యుత్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు పట్టణ పౌరుల సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి బాబురావు తెలిపారు. మంగళవారం పట్టణంలోని వివేకానంద ఆడిటోరియంలో ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను బలవంతంగా ఏర్పాటు చేస్తున్నారన్నారు. వీటివల్ల విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు యేసురత్నం, శ్రీనివాసమూర్తి, నాగరాజు, తోటమద్దులు, పుల్లా నరసింహా, వెంకటలింగం తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా కౌన్సిల్ సమావేశం


సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

నంద్యాల, జూలై29(ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. మంగళవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ షేక్ బాబున్నిసా అధ్యక్షతన జరిగిన ఈసమావేశం జరిగింది. నగరంలోని పలు వార్డుల్లోని సమస్యలపై అధికారులు.. కౌన్సిలర్ల మధ్య కాసేపు వాదన కొనసాగింది. చెరుకు లక్ష్మీదేవి, జైనాబీలు ఏకంగా కింద కూర్చొని తమ వార్డుల్లో సమస్యలు పరిష్కారించడం లేదని నిరసన తెలిపారు. దీంతో వెంటనే కమిషనర్ శేషన్న స్పందించి తమ వార్డులతో పాటు అన్ని వార్డుల్లోని సమస్యలను పరిష్కారించే విధంగా కృషి చేస్తామని సర్దిచెప్పారు. ప్రధానంగా నగరంలో ఎక్కడ చూసిన కుక్కలు.. దోమల బెడద ఎక్కువగా ఉందని వెంటనే పరిష్కారించాలని కోరారు. కొందరైతే ఏకంగా కుక్కలను పెంచి నగరంలోకి వదులుతున్నారని ఆరోపించారు. ఇదే క్రమంలో పలువార్డు ల్లో పలు అభివృద్ధి పనులు కుంటుపడ్డాయని కౌన్సిల్ ముందుంచారు. నిధులున్నా.. టెండర్లు జరిగిన పనిచేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. స్పౌజ్ పింఛన్లను మంజూరు చేసేలా చూడాలని కోరారు. పింఛన్లపై వివిధ రకాల ఆరోపణలు చేయడంతో పలువురు కౌన్సిలర్ల మధ్య వాదోపవాదాలు సాగాయి. ఛైర్ పర్సన్, కమిషనర్ స్పందించి 21 అంశాలకు ఆమోదం తెలిపి కౌన్సిల్ సమావేశాన్ని ముగించారు. సమావేశంలో వైస్ ఛైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, ఎంఈ గుర్రప్పయాదవ్, టౌన్ ప్లానింగ్ అధికారి మూర్తి, శానిటేషన్ సూపర్‌వైజర్ మురళిధర్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి గ్రామాన్ని ఆదర్శ సోలార్ గ్రామంగా తీర్చిదిద్దాలి

● కలెక్టర్ రాజకుమారి


వీసీలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామాన్ని ఒక ఆదర్శ సోలార్ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్క అధికారి కృషిచేయాలని కలెక్టర్ రాజకుమారిఅధికారులను ఆదేశించారు. పీఎం సూర్యఘర్ పథకంపై జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఒక్కరూ పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకుని జిల్లాను గ్రీన్ ఎనర్జీగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని, ఈ పథకం ద్వారా ఆదాయం పెరగడంతో పాటు కాలుష్యం నివారించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చన్నారు. ఒకసారి ఇంటిపైకప్పుపై సోలార్ ఏర్పాటు చేసుకుంటే 25 ఏళ్ల వరకు విద్యుత్ సమస్య ఉండదన్నారు. ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి అయితే ప్రభుత్వానికే అమ్మవచ్చన్నారు. అధికారులు గ్రామాలకు వెళ్లి ఎంపీటీసీ, జడ్పీటీసీలను సమన్వయం చేసుకుని సోలార్‌పై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఒక్కొక్క నియోజకవర్గానికి 10వేల కనెక్షన్లను లక్ష్యంగా ఇవ్వడం జరిగిందని, ఏడు నియోజకవర్గాలకు కలిపి 70వేల కనెక్షన్‌లు సాధించాలన్నారు. ఈ పథకం ద్వారా కిలోవాట్‌కు రూ.30వేల సబ్సిడీ, రెండు కిలోవాట్స్‌కు రూ.60వేలు, మూడు కిలోవాట్స్‌కు రూ.78వేలు సబ్సిడీ ఉంటుందన్నారు., ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. రాబోయే రోజుల్లో జిల్లాను సోలార్ వెలుగులతో నింపి దేశంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషిచేద్దామని పిలుపునిచ్చారు.

నిబద్ధతతో పనిచేసి మంచిపేరు తెచ్చుకోవాలి: మంత్రి ఫరూక్


దీబగుంట్ల సొసైటీ అధ్యక్షుడు ఓబుళరెడ్డిని సన్మానిస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

గోస్పాడు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సహకార సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికైనవారు నిబద్ధతతో పనిచేసి మంచిపేరు తెచ్చుకోవాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. మంగళవారం దీబగుంట్ల సహకార సొసైటీ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన ఓబుళరెడ్డిని మంత్రి ఫరూక్ సన్మానించారు. నంద్యాల నియోజకవర్గంలో ఉన్న 5 సహకార సొసైటీలకు అధ్యక్షులను ఎన్నుకున్నామన్నారు. సొసైటీలను అభివృద్ధి కేంద్రాలుగా మార్చుకొని వ్యవసాయపరంగా రైతులకు అవసరమైన సదుపాయాల కల్పనకు కృషిచేయాలన్నారు. సొసైటీలకు వచ్చే రైతులకు లోన్లు, ఎరువులు సకాలంలో అందించాలని సూచించారు. అధ్యక్షుడితోపాటు డైరెక్టర్లు కొల్లి చంద్రశేఖర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ యువనాయకుడు ఎన్ఎండి ఫయాజ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల రూరల్: పారిశుధ్య కార్మికులు, నాన్ పీహెచ్ వర్కర్లు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సూచించారు. మంగళవారం సలీమ్‌నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించాలని కోరారు. వైద్యుల సూచన మేరకు మందులు వాడలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాబున్నిసా, వైద్యాధికారులు పాల్గొన్నారు.

డ్రోన్ అందజేత


రైతుకు డ్రోన్ అందజేస్తున్న అధికారులు

పగిడ్యాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెహ్రూనగర్ గ్రామానికి చెందిన సంగమేశ్వర రైతుల గ్రూప్‌కు ప్రభుత్వం సబ్సిడీ కింద మంజూరైన డ్రోన్‌ను వ్యవసాయాధికారి మురళీధర్, యూనియన్ బ్యాంక్ మేనెజర్ సురేష్ టీడీపీ నాయకులు లోకానందరెడ్డి, రామిరెడ్డి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో పగిడ్యాల సొసైటీ డైరెక్టర్ పల్లె గంగన్న, నాయకులు ఫరూక్ బాషా, చాకలి రామస్వామి, రామిరెడ్డి, రైతులు వెంకటేశ్వర్లు , నారాయణ, రంగస్వామి, జయరాముడు తదితరులు ఉన్నారు.

నందికొట్కూరు రూరల్: డ్రోన్లతో రైతులకు పనితో పాటు ఖర్చు కూడా తగ్గుతుందని మండల వ్యవసాయాధికారి షేక్షావళి, మార్కెట్ యార్డు ఛైర్మన్ వీరం ప్రసాదరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బొళ్లవరంగ్రామంలోని మొక్కజొన్న పంటలో డ్రోన్‌తో నానో ఎరువుల పిచికారిని వ్యవసాయాధికారుల సమక్షంలో రైతులకు డెమో చూపించారు. డ్రోన్ తో పిచికారి చేసుకోవడంతో సమయం ఆదా కావడమే కాకుండా ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, ఆర్ఎస్‌కే సిబ్బంది, పాల్గొన్నారు.

పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల



జూపాడుబంగ్లా, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి దిగువ కాల్వలోకి మంగళవారం నీటి విడుదలను పెంచారు. ఎగువప్రాంతంలో వరదప్రవాహం పెరగడంతో శ్రీశైలం జలాశయానికి ఇన్‌ఫ్లో భారీగా వచ్చి చేరుతుంది. దీంతో నీటిపారుదలశాఖ అధికారులు పోతిరెడ్డిపాడు నుంచి 20వేల క్యూసెక్కుల నుంచి 31వేల క్యూసెక్కులకు పెంచి ఆరుగేట్ల నుంచి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ నీటిని బానకచర్ల నీటిసముదాయం నుంచి తెలుగుగంగకు 13వేలు, జీఎన్ఎస్ఎస్ 9వేలు, కేసీ ఎస్కేప్‌కు 9వేల క్యూసెక్కుల చొప్పున మళ్లిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పిచ్చికుక్కల దాడిలో ఎద్దులు మృతి

కొత్తపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాగంపల్లిలో మంగళవారం పిచ్చికుక్కల దాడిలో మూడు ఎద్దులు మృతి చెందాయి. గ్రామానికి చెందిన మాదిగ రాజు చెందిన సుమారు రూ.1.50 లక్షలు విలువగల రెండు కాడెద్దులపై పిచ్చికుక్కలు దాడి చేశాయి. ఈ విషయంపై దుద్యాల పశువైద్యాధికారి అశోక్ కుమార్‌ను వివరణ కోరగా.. విషయం తెలుసుకుని ఆత్మకూరు ఏడీ చంద్రలీలతో పాటు సిబ్బంది గ్రామానికి చేరుకుని గ్రామంలోని 130 ఎద్దులు, బర్రెలకు వ్యాక్సిన్‌లు వేసినట్లు తెలిపారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ

జూపాడుబంగ్లా, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు చదువులో రాణించాలని మండల ప్రత్యేక అధికారి నాగరాజరావు సూచించారు. మంగళవారం పాఠశాలలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూప్రకారం భోజనాలు పెడుతున్నారా, అందరికీ స్కూల్‌యూనిఫాంతోపాటు పుస్తకాలు అందించారా, లేదా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపికృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ

గడివేముల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిందాల్ పరిశ్రమలో మంగళవారం విద్యార్థులకు జిందాల్‌గ్రూప్ అందించే స్కాలర్‌షిప్‌లను ఏఎస్పీ మందజావలి ఆల్ఫస్ పంపిణీ చేశారు. పదోతరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, ఎంబీబీఎస్ చదువుతున్న 126 మంది విద్యార్థులకు రూ.20,02,957 విలువైన స్కాలర్‌షిప్ చెక్కులను అందజేశారు. యూనిట్ హెడ్ నవనిత్‌చౌహాన్, సాజిష్‌గంగాధర్ కూరూప్ మహిళల ఆర్థిక పురోగతి చెందేందుకు వారికి కుట్లు, అల్లికలపై శిక్షణ ఇస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ వినిత్‌సిన్హా, పాణ్యం సీఐ కిరణ్ కుమార్‌రెడ్డి, సీఎస్ఆర్ మేనేజర్ రవికుమార్, వంశీ పాల్గొన్నారు.

కార్మికులపై పోలీసుల దాడి అమానుషం

ఆత్మకూరురూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు మున్సిపల్ కార్మికులపై పోలీసుల దాడి అమానుషమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఉపాధ్యక్షుడు రణధీర్, ఏపి మున్సిపల్ వర్కర్స్ నాయకులు నాగన్న, పెద్ద నాగరాజు తెలిపారు. మంగళవారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసనను వ్యక్తం చేశారు. దాడికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు తిమ్మ య్య, గొడుగు రాజు,రాజేష్, నాగన్న, సువర్ణమ్మ పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతో అధిక దిగుబడులు


మాట్లాడుతున్న డాక్టర్ జాన్సన్

నంద్యాల రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక సాంకేతిక విధానం ద్వారా పంటలను సాగు చేసినట్లయితే అధిక దిగుబడులను సాధించవచ్చని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానపు సంచాలకులు డాక్టర్ జాన్సన్ పేర్కొన్నారు. మంగళవారం పరిశోధన స్థానపు దత్తత గ్రామమైన పులిమద్ది గ్రామంలో సాగు విధానంపై అవగాహన కల్పించారు. మొక్కజొన్న, జొన్న, సోయాచిక్కుడు తదితర పరిశీలించారు. అనంతరం ఆయన చీడపీడల నివారణకు తగిన సలహాలిచ్చారు. కార్యక్రమంలో సహా పరిశోధన సంచాలకులు శివరామకృష్ణ, శాస్త్రవేత్తలు రాధాకుమారి, వెంకటరమణమ్మ, ప్రకాశ్‌రెడ్డి, వెంకటరమణ, వీఏఏ నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు పంపిణీ


విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు, జూలై 29(ఆంధ్ర జ్యోతి): ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మంగళవారం కళాశాల పూర్వవిద్యార్థులు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. 1986-87లో పదో తరగతి పూర్తిచేసుకున్న పూర్వవిద్యార్థులు ఈఏడాది పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన దీపికయాదవ్‌కు రూ.5వేలు, అబుబక్కర్‌కు రూ.3వేలు, షేక్.జునైద్‌కు రూ.2వేల చొప్పున నగదును పాఠశాల హెచ్ఎం నాగరాజు అందజేశారు. కార్యక్రమంలో 1986-87 బ్యాచ్ పూర్వ విద్యార్థులు షేక్ నూర్అహ్మద్, రామ్మూర్తి, షఫి, కలిముల్లా, సాదిక్, శ్రీధర్, పువ్వాడి రామకృష్ణ, చంద్రశేఖర్, జగదీష్, మల్లికార్జున, అష్రఫ్అలి ఉన్నారు.

మహానందిలో పూజలు


అంజనీకుమార్‌ను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

మహానంది, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మహానందిలో ఏపీ జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ ప్రిజన్స్ అంజనీకుమార్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ముఖ మండపం వద్ద ఇన్‌చార్జి పర్యవేక్షకుడు పసుపుల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు అభిషేకార్చన పూజలను జరిపారు. ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి శాలువాతో సన్మానించి, ప్రసాదాలు అందచేశారు. వీరివెంట మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దపులుల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ


కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారులు

ఆత్మకూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): పెద్దపులుల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతోందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న, ఎఫ్ఎస్‌వోలు జ్యోతిస్వరూప్, మహేశ్వరీ పేర్కొన్నారు. మంగళవారం అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. వారు మాట్లాడుతూ.. ఎక్కడైతే పులుల సంరక్షణ సజావుగా సాగుతుందో ఆ ప్రాంతం పర్యావరణహితంగా ఉంటుందని వివరించారు. పర్యావరణ సూచికలో పెద్దపులే అగ్రభాగన నిలుస్తోందని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, అప్పుడే పెద్దపులుల రక్షణ మరింతగా మెరుగుపడుతోందని ఆకాంక్షించారు. అనంతరం వివిధ ప్రతిభా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుజాత, రవికుమార్, శివశంకర్, షాషావలి, బ్రహ్మానందం, కవిత, మద్దిలేటి, జావీద్‌హుసేన్ ఉన్నారు.

మహానంది: నల్లమలలోని వన్యప్రాణులను సంరక్షించే బాధ్యత అందరిది అని అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హైమవతి అన్నారు. మంగళవారం ప్రపంచ పులుల దినోత్సవం పురస్కరించుకొని మహానందిలో విద్యార్థులతో కలిసి అటవీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు తిమ్మాపురంలోని ఆదర్శ పాఠశాల పరిసరాల్లో మెక్కలు నాటారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ రామకృష్ణ, నాగేంద్ర, సిబ్బంది రాణా ప్రతాప్, శ్రీనివాసులు, శంఖరిబాయి, బలరాముడు, సోషల్ పారెస్ట్ బాషా పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

బండిఆత్మకూరు జూలై 29(ఆంధ్రజ్యోతి): పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం గత ఏడాది సెప్టెంబర్‌లో ఏ కోడూరు మాజీ ఎంపీటీసీ దేవదాసు అనారోగ్యంతో ఆసుపత్రిలో మృతి చెందారు. కుటుంబ పరిస్థితి బాగా లేకపోవడంతో సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేయించుకున్నారు. ప్రభుత్వం నుంచి రూ.71,500 మంజూరైన చెక్కును మంగళవారం ఎమ్మెల్యే ఆయన భార్య విశావసమ్మకు అందజేశారు. ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నందికొట్కూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీలో దినసరి కూలీలుగా పని చేస్తున్న వారికి వేతనాలు పెంచి, వారిని ఆప్కాస్‌లో చేర్చాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. నరసింహులు మాట్లాడుతూ మున్సిపాలిటీలో గత 6 సంవత్సరాల నుంచి 60 మంది కార్మికులు పారిశుధ్య విభాగంలో దినసరి కూలీలుగా పని చేస్తున్నారని, వారికి రూ.9600 మాత్రమే జీతాలు చెల్లిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు మజీద్ మియా, ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు గోపాల్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గోవిందు, మున్సిపల్ డైలీవేజ్ వర్కర్స్ యూనియన్ నాయకులు అశోక్, వెంకటేశ్వర్లు, రవణమ్మ, పాల్గొన్నారు.

శ్రీశైలంలో విశేష పూజలు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం శ్రీశైలం క్షేత్రంలో బయలువీరభద్రుడు, సుబ్రమణ్యస్వామి వారికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. క్షేత్ర పాలకుడైన బయలు వీరభద్రస్వామికి, ఆలయ ప్రాంగణంలోని సుబ్రమణ్యస్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : అన్ని వర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని మల్యాల గ్రామంలో ఇంటింటికీ తిగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామంలో ఓ వృద్ధురాలిని పలకరిస్తూ ఎమ్మెల్యే అవ్వా పెన్షన్ అందుతోందా అని ఆప్యాయంగా పలకరించారు. వృద్ధురాలు అందుతోందని అవ్వ సంతోషంగా చెప్పింది. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్ర నాథరెడ్డి, రాష్ట్ర యాదవ కమిటీ మెంబర్ కడియం వెంకటేశ్వర్లు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యశర్మ, ఎంఈవో శ్రీనివాసులు, ఏఓ షేక్షావళి, ఏపీఎం శ్రీనివాసులు, ఏపీవో రవిప్రకాష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాధవి, సీసీ రమణయ్య, నాయకులు మద్దిలేటి, అంజిబాబు, బోయ సవారి, బాలక్రిష్ణ, సురేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

● విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే జయసూర్య ప్రధానోపాధ్యాయుడికి, వంట నిర్వాహకులకు సూచించారు. బుధవారం మండలంలోని మల్యాల గ్రామంలో ఆదర్శ ప్రాథమిక పాఠశాలలను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు గోపినాథరావ్ పాల్గొన్నారు.

మిడుతూరు: ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మంగళవారం చెరుకుచెర్ల గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు సర్వోత్తమ రెడ్డి, రఘురామయ్య, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, సొసైటి ఛైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, మార్కెట్‌యార్డు వైస్ ఛైర్మన్ సుధాకర్, గ్రామ సర్పంచు మరియమ్మ, శివరామి రెడ్డి, రామస్వామి రెడ్డి, భూపాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

పగిడ్యాల: పగిడ్యాలకు చెందిన పగడం నాగేంద్ర(43) అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందడంతో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మృతిడి కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. మృతదేహం వద్ద నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడి కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందిచారు. ఆయన వెంట మండల కన్వీనరు పలుచాని మహేశ్వరరెడ్డి, సొసైటీ ఛైర్మన్ దామోదార్‌రెడ్డి, ఒగిలి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

నేడు మంత్రులు బీసీ, ఆనం రాక

కొలిమిగుండ్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయ మహాసంప్రోక్షణ, కుంభాభిషేకం కార్యక్రమాల్లో పాల్గొనడానికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి బుధవారం రానున్నారు. రామ్‌కో ఆధ్వర్యంలో ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేపట్టారు. మంత్రులతో పాటు, రామ్‌కో ఎండీ వెంకటరామరాజు పూజల్లో పాల్గొనున్నారు. కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

మంత్రి ఆనంకు ఘన స్వాగతం

కోవెలకుంట్ల: దేవదాయశాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి మంగళవారం రాత్రి కోవెలకుంట్ల మీదుగా బనగానపల్లెకు వెళ్తుండగా పట్టణంలో సొసైటీ చైర్మన్ గువ్వల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పలువురు స్వాగతం పలికారు. కార్యక్రమంలో బనగానపల్లె మార్కెట్ యార్డు చైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దిలేటి, నాయకులు రాజశేఖర్ తదితరులున్నారు.

ఘనంగా గరుడ పంచమి జయంతి

ఆళ్లగడ్డ, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో మంగళవారం గరుడ పంచమి జయంతి ఉత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాల్ స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేదపండితులు గరుత్మంతుడికి క్షీరాభిషేకం, విశేష పుజలు నిర్వహించారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సుందర రాజన్ దంపతులు, అధికారులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఆటల పోటీలు ప్రారంభం

చాగలమర్రి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి లాగోరి ఆటల పోటీలను మంగళవారం చాగలమర్రి గ్రామంలోని సెయింట్‌ఆన్స్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం స్మిత, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సంజీవరాయుడు, జిల్లా కార్యదర్శి వెంకటేష్ ప్రారంభించారు. బాలుర ఉన్నత పాఠశాల, కేజీబీవీ, బాలికల పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభకనబరిచిన విద్యా ర్థులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో పీడీలు శ్రీనాథ్, అలివేలు, క్రీడాకారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కోవెలకుంట్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఏఎస్‌ఐ నాగరాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీవాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అధ్యక్షతన విద్యార్థులకు శక్తియాప్‌పై, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, లక్ష్మీదేవి, అన్నపూర్ణ, కృష్ణదాసు, నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి: సీపీఎం

డోన్ రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్, పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు చిన్న రెహిమాన్, శివరాం, భాస్కర్ రెడ్డి, నాగమద్దయ్య, షమీమ్‌భేగం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కోవెలకుంట్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు వికాస్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు షణ్ముక, ఓ.కిరణ్‌కుమార్ ఎంపికైనట్లు కరస్పాండెంట్ వినోద్‌కుమా ర్ తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, క్యాంపస్ ఇన్‌చార్జి, ఉపాధ్యాయులు , పీఈటీలు అభినందించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

- మున్సిపల్ చైర్మన్ చలంరెడ్డి


మాట్లాడుతున్న చైర్మన్ చలంరెడ్డి

బేతంచెర్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఆయా వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ చలంరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్‌చలంరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. అధికారులు వివిధ అభివృద్ధి పనుల ఆమోదం కోసం అజెండాలోని అంశాలను చదివి వినిపించారు. కౌన్సిలర్లు ముబీనా , ఇబ్రహీం, మధు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకవచ్చారు. ఆయా వీధుల్లో కుక్కల బెడద అధికంగా ఉందని, చిన్నపిల్లలు ఇంటి నుంచి బయటకు వస్తే దాడులు చేస్తున్నాయని, కుక్కల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కమిషనర్ హరిప్రసాద్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు

శిరివెళ్ల, జూలై 29(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు డిప్యూటీ డీఈవో డీటీ శంకర్ ప్రసాద్ తెలిపారు. నంద్యాల జిల్లా పరిధిలో శిరివెళ్ల మోడల్ స్కూల్ బెస్ట్ పీఎంశ్రీ పాఠశాలగా ఎంపికవ్వడంతో శిలాఫలకాన్ని ఆయన మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎంవో మాధవీలత, ప్రిన్సిపాల్ ఇష్రత్ బేగం, మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, విద్యా కమిటీ చైర్మన్ లావణ్య, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రంగారెడ్డి సేవలు ఎనలేనివి

డోన్ టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది దివంగత కేబీఎం రంగారెడ్డి సేవలు ఎన లేనివని డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శీలం భాస్కర్ నాయుడు, సీనియర్ న్యాయవాది నాగభూషణం రెడ్డి అన్నారు. మంగళవారం రంగారెడ్డి 17వవర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు, స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం నిర్వహించారు. ముందుగా బార్ అసోసియేషన్ నాయకులు, కోర్టు సిబ్బంది రంగారెడ్డి చిత్రపటానికి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో రంగా రెడ్డి కుమారుడు మహిపాల్ రెడ్డి, కుటుంబ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై స్పందించాలి

ప్యాపిలి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బాధితుల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని ఎస్‌ఐ మధుసూదన్ సూచించారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన సచివాలయ పోలీసులతో సమావేశాన్ని నిర్వహించారు. సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజలతో స్నేహభావంతో మాట్లాడాలన్నారు. సమస్య తీవ్రమైనప్పుడు వెంటనే తమకు సమాచారం అందించాలని ఎస్‌ఐ సూచించారు. అలాగే మహిళా చట్టాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పలువురు మహిళా పోలీసులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా భవన నిర్మాణాలు

- వరండాల్లో చదువులు
- ఇబ్బందుల్లో విద్యార్థులు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

రుద్రవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల నిర్మాణ పనులు అర్థాంతరంగా నిలిపివేశారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారింది. పాఠశాలలో అభివృద్ధి పనులు, అంగన్‌వాడీ కేంద్రాల కొత్త భవనాలు పూర్తిచేయిస్తుందని కూటమి ప్రభుత్వంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆశలు పెట్టుకున్నారు. మండలంలోని 42 పాఠశాలల అభివృద్ధికి, ఏడు అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలకు 'నాడు నేడు' కింద రూ.13,33,28,000 నిధులు వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో రూ.4,66,59,000 నిధులు విడుదలయ్యాయి. వీటిలో రూ.4,29,43,000 ఖర్చు చేశారని విద్యాశాఖ నివేదికలు చెబుతున్నాయి. అప్పట్లో బిల్లులు మంజూరు చేయకపోవడంతో పాఠశాల్లో అదనపు గదుల నిర్మాణం, ప్రహరీ, మరుగదొడ్ల నిర్మాణం ఇంకా పలురకాల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. గత ప్రభుత్వం నాడు నేడు పేరును ప్రస్తుతం కూటమి ప్రభుత్వం స్కూలు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంటు మార్చింది.

చెట్ల కింద చదువులు

పాఠశాలల్లో గదులు లేక వరండాల్లో చెట్లకింద కూర్చొని విద్యార్థులు చదువుకుంటున్నారు. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలకు సంబంధించిన ఇనుపకడ్డీలతో విద్యార్థులకు ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. దీనికి బాధ్యులు ఎవరు?

- ఆలమూరు ఉన్నత పాఠశాల్లో భవనాల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. యల్లావత్తుల, బీరవోలు, డి.కొట్టాల స్పెషల్ పాఠశాలలో ప్రహరీ పనులు అసంపూర్తిగా నిలిచాయి.
- రుద్రవరం మెయిన్ పాఠశాలల్లో భవనం వరకు నిర్మించారు. పనులు నిలిచిపోయాయి. ఆలమూరులో స్పెషల్ పాఠశాలల్లో పనులు నిలిచాయి. ముకుందాపురం ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో పనులు అసంపూర్తిగా ఉన్నాయి. నరసాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ, గదుల పనులు అసంపూర్తిగా ఉన్నాయి.
- ఎర్రగుడిదిన్నె, పెద్దకంబలూరు, యల్లావత్తుల జడ్పీహెచ్‌ఎస్‌లో పనులు అసంపూర్తిగా ఉన్నాయి. హరినగరం ప్రాథమిక పాఠశాలలో పనులు అసంపూర్తిగా ఉన్నాయి. చిత్తరేణిపల్లె ప్రాథమిక పాఠశాల పనులు అసంపూర్తిగా ఉన్నాయి.


రుద్రవరం మెయిన్ పాఠశాలలో అసంపూర్తిగా నిలిచిన భవనం


వరండాలో కూర్చున్న విద్యార్థులు

అసంపూర్తిగానే అంగన్‌వాడీ..

అంగన్వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయి. నరసాపురం, డి.కొట్టాలు, కొండమాయపల్లె, మరో రెండు గ్రామాల్లో భవనానికి శ్లాబులు వేసి ఇటుకలతోనే పనులు నిలిపివేశారు. పేరూరులో రూఫ్‌లెవల్ భవనాన్ని నిర్మించి వదిలేశారు. ముత్తులూరులో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు నిలిచిపోగా అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. చిన్న చిన్నభవనాల్లో కేంద్రాలు కొనసాగడంతో పిల్లలకు ఇబ్బందులు తప్పడంలేదు.

అధికారుల ఆదేశాలు అందిన వెంటనే..



ఉన్నతాధికారుల ఆదేశాలు అందిన వెంటనే పాఠశాలల్లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం. ప్రస్తుత ప్రభుత్వం స్కూలు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్ అని కొత్త నామకరణం చేసింది.

- వీరరాఘవయ్య, ఎంఈవో, రుద్రవరం

త్వరితగతిన పూర్తి చేయాలి

- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- జుర్రేరు డ్రైనేజీ పనుల పరిశీలన


డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జుర్రేరు డ్రైనేజీ పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ అధికారులను రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని బంగారమ్మ తోట జుర్రేరు వాగు సమీపంలో జరుగుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. అధికారులకు పలు సలహాలు సూచనలు చేశారు. పనులు నాణ్యంగా చేయాలని ఆదేశించారు. స్థానికులు సమస్యలను ఆయన దృష్టికి తీసుకరాగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి వెంట బనగానపల్లె పంచాయతీరాజ్ డీఈ నాగశ్రీనివాసులు, తహసీల్దారు నారాయణరెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఏఈ రామ్మోహన్‌రెడ్డి, సీఐలు మంజునాథరెడ్డి, ప్రవీణ్‌కుమార్, ఈవో సతీశ్‌రెడ్డి, సర్వేయర్లు, కాంట్రాక్టర్లు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఏక్ కమాన్ మసీదు గదులు ప్రారంభించిన మంత్రి బీసీ

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పట్టణంలోని కొండపేటలోని ఏక్‌కమాన్ మసీదులో రూ. 10లక్షలు వెచ్చించి నిర్మించిన గదులను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో షాదీఖానా నిర్మించి మైనార్టీలకు అంకితం చేస్తామన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ముస్లిం మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

వామ్మో.. కొండముచ్చు

- వారం రోజుల్లో 30మందిపై దాడి
- భయాందోళనలో జలదుర్గం వాసులు

ప్యాపిలి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జలదుర్గం గ్రామాన్ని కొండముచ్చు వణికిస్తోంది. వారం రోజుల్లో దాదాపు 30 మందిపై దాడి చేసి గాయపరిచింది. దీంతో బయటికి రావాలంటే ప్రజలు భయాందోళనలకు గురవుతు న్నారు. 15 రోజుల క్రితం గ్రామానికి వచ్చిందని, మతిస్థిమితం కోల్పోయిందో ఏమో కానీ దారిన పోయేవారిపై, పొలాల్లో పనిచేసే రైతులు, మహిళలపై దాడి చేస్తోంది. గుంపులు గుంపులుగా కర్రలు పట్టుకొని గ్రామంలో తిరాగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కొండముచ్చును పట్టుకొని అటవీ ప్రాంతంలో వదలాలని వేడుకుంటున్నారు.


కొండముచ్చు దాడిలో గాయపడిన వ్యక్తిని పరామర్శిస్తున్న రెవెన్యూ అధికారి


వివరాలు తెలుసుకుంటున్న జిల్లా ఫారెస్టు అధికారి నాగమహేశ్వరి

గ్రామంలో పర్యటించిన ఫారెస్టు అధికారులు

కొండముచ్చును బందించి అటవీ ప్రాంతానికి తరలిస్తామని జిల్లా ఫారెస్టు అధికారి నాగమహేశ్వరి తెలిపారు. మంగళవారం ఆమె గ్రామంలో పర్యటించారు. కొండముచ్చు దాడులపై ఆరా తీశారు. గ్రామస్థులు కేసీ మద్దిలేటి, సందీప్ తదితరులతో కలిసి కొండముచ్చు సంచరించే ప్రాంతాలను ఆమె పరిశీలించారు. రిస్క్యూ టీం ద్వారా కొండముచ్చును బందించే చర్యలు చేపడుతామన్నారు. ఆమె వెంట అటవిశాఖ అధికారులు , సిబ్బంది ఉన్నారు.

సుపరిపాలన చంద్రబాబుతోనే సాధ్యం


కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

బేతంచెర్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుపరిపాలన, అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొలుములపల్లె, బలపాలపల్లె, పాపసాని కొట్టాల, తవిసికొండ గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, కరపత్రాలు అందించారు. అంతకుముందుగా ఆయా గ్రామాల్లోని టీడీపీ నాయకులు, ప్రజలు ఎమ్మెల్యేను పూలమాలలతో సత్కరించారు. అనంతరం కొలుములపల్లె ఆంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, సీనియర్ నాయకులు పోలూరు శ్రీనివాసరెడ్డి, పోలూరు రాఘవ రెడ్డి, మండల సహకార సంఘం చైర్మన్ చంద్రశేఖర్, తిరుమలేష్ చౌదరి, జావాజీ వెంకటేశ్వర్లు, సుధాకర్, బుగ్గన బ్రహ్మానందరెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

డోన్ టౌన్: కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని 29వ వార్డు ఇన్‌చార్జి మధు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఇందిరా నగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు శేఖర్, బోయ మధు, రామకృష్ణ తదితరులున్నారు.

దొర్నిపాడు: రాష్ట్రంలో టీడీపీతోనే సుపరిపాలన సాధ్యమని టీడీపీ నాయకులు కట్టుబడిబాష, జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, వెంకటపుట్టయ్య, కట్టుబడిబాష శ్రీకాంత్, రఫీ, అబ్దుల్‌రహిమ్, పెట్టికోట బాష తదితరులున్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

బనగానపల్లె, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా దిశ స్టేషన్ సీఐ గౌతమి అన్నారు. మంగళవారం కైప గ్రామంలో బనగానపల్లె సీఐ మంజునాథరెడ్డి, నందివర్గం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో గ్రామస్థులకు, పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర సర్వే చేపట్టాలి

బనగానపల్లె, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పాడిరైతుల జీవన ప్రమాణాలపై సమగ్ర సర్వే చేపట్టాలని ఆళ్లగడ్డ డివిజన్ పశువైద్యశాల డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య సూచించారు. మంగళవారం బనగానపల్లె పశువైద్యశాలలో ఏడీ మారుతీసకారం ఆధ్వర్యంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పశువైద్యులు, పారా వెటర్నరీ సిబ్బంది, ఏహెచ్‌ఏలు, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

సబ్సిడీ పథకాన్ని వినియోగించుకోవాలి

కోవెలకుంట్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సోలార్‌సన్ రూఫ్ సబ్సిడీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ స్పెషల్ కలెక్టరు ఓ.రామభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై గ్రామ సభలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి కల్యాణి, తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీవో వర ప్రసాదరావు, అధికారులు అనంతరావు, శేఖర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడుతాం

రుద్రవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పోరాడుతామని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం సాయంత్రం పెద్దకంబలూరు గ్రామంలో సీపీఐ సభ నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ, ప్రజానాట్యమండలి కళాకారులు ఆధ్వర్యంలో విప్లవ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో బాలనరసిరహులు, తాలుకా కార్యదర్శి భాస్కర్, జిల్లా కార్యదర్శి సుంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఉయ్యాలవాడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఎంపీడీవో ఉమామహేశ్వర్‌రావు ఆదేశించారు. మంగళవారం మండలంలోని ఆర్. జంబుల దిన్నె, పెద్దయమ్మనూరు గ్రామా సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఈలు వెల్ఫేర్ అసిస్టెంట్లు ఉన్నారు.

చికెన్ షాపుల్లో తనిఖీలు

ఆళ్లగడ్డ, జూలై 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు చికెన్ దుకాణాలలో మంగళవారం జిల్లా అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కూర్మ నాయకులు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు వెంకటరాముడు, రామచంద్ర, అధికారులు ఏకకాలంలో ఐదు చికెన్ సెంటర్లలో శ్యాంపిల్స్ సేకరించి విజయవాడ ల్యాబ్‌కు పంపారు. నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అభిరెడ్డి, పల్లి, వెంకటాపురం, గుమ్మకొండ, బొంతిరాళ్ల గ్రామాలకు బుధవారం, గురువారాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ డిప్యూటీ ఇంజనీర్ నాగేంద్ర, రూరల్ ఏఈ నాగేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటాపురం ఫీడర్ కింద రూరల్ డెవలప్‌మెంట్ (ఆర్‌డీఎస్) ఆధ్వర్యంలో 11 కేవీ లైన్ పనుల జరుగుతున్నాయన్నారు.

డ్రోన్ అందజేత

దొర్నిపాడు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల రైతులకు 80 శాతం సబ్సిడీపై డ్రోన్‌ను అందజేస్తామని వ్యవసాయాధికారి ప్రమీల అన్నారు. మంగళవారం దొర్నిపాడు రైతు సేవా కేంద్రంలో రైతు భూపనపాటి సతీష్‌కు యూనియన్ బ్యాంకు మేనేజర్ విజయ్‌కుమార్, ఏవో ప్రమీల కిసాన్ డ్రోన్ అందజేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ డ్రోన్ కావాల్సిన రైతులు మండల వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కిసాన్‌డ్రోన్ వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా ఐదుమంది రైతులు గ్రూప్‌గా ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చి డ్రోన్ మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు ఉన్నారు.

పంట కాలువలకు సాగునీరు విడుదల


ముత్యాలపాడు చెరువు నుంచి నీరు విడుదల చేస్తున్న చైర్మన్, టీడీపీ నాయకులు

చాగలమర్రి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలపాడు ఎర్రచెరువు నుంచి ఆయకట్టుకు సాగునీరును మంగళవారం సాగునీటి సంఘ చైర్మన్ గోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు విడుదల చేశారు. టీజీపీ లీకేజీ ద్వారా చెరువుకు నీరు చేరడంతో కాలువలకు తూము సెట్టర్‌ను ఎత్తి నీటిని విడుదల చేశామని చైర్మన్ తెలిపారు. 1,000 ఎకరాల దాక సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఏడాది ముందస్తుగానే చెరువుకు నీరు చేరడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇండ్ల రమణారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, లింగమయ్య, పుల్లయ్య, బాష, బాబయ్య, సాయిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు హ్యాండ్‌బుక్స్ అందజేత

చాగలమర్రి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా కూటమి ప్రభుత్వం విద్యారంగంలో పలు మార్పులు చేస్తోంది. అందులో భాగంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల టీచర్లకు తొలిసారిగా ఉపాధ్యాయుల కరదీపిక (హ్యాండ్ బుక్) పేరుతో పుస్తకాలు అందిస్తోంది. ఎస్‌ఈఆర్టీ సహకారం తో సమగ్రశిక్ష ద్వారా సామర్థ్య ఆధారిత బోధన, అభ్యసన ఉపాధ్యాయ వనరు పేరుతో వీటిని రూపొందించింది. మూసవిధానానికి తిలోదకాలిచ్చి బోధనలో కొత్తదనాన్ని ప్రోత్సహించేలా వీటిని రూపుదిద్దుకున్నాయి. 1నుంచి 10వ తరగతి వరకు సంబంధించిన ఉపాధ్యాయు లకు వీటిని ప్రభుత్వం అందించింది. చాగలమర్రి మండలంలో 205మంది ఉపాధ్యాయులకు హ్యాడ్‌బుక్స్‌ను పంపిణీ చేశామని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల తెలిపారు. హ్యాడ్‌బుక్ ద్వారా విద్యార్థులకు బోధన చేయడం సులభతరం అవుతుందన్నారు.

టీబీ రహిత సమాజమే లక్ష్యం


క్రిష్టిపాడులో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు వెంకటశివ

దొర్నిపాడు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): టీబీ రహిత సమాజమే లక్ష్యమని దొర్నిపాడు వైద్యాధికారి వెంకటశివ తెలిపారు. మంగళ వారం క్రిష్టిపాడు గ్రామంలో టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. టీబీవ్యాధి వ్యాధి పట్ల జాగ్రత్త వహించాలని అన్నారు. టీబీ ఉన్నవారికి 6 నెలల పాటు మందులను ఉచితంగా అందజేస్తామని అన్నారు. అనంతరం రోగులకు ఆయా పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ రవి, సూపర్‌వైజర్ సాయికృప, సీహెచ్‌వో విమల, ఏఎన్‌ఎం చెన్నమ్మ, ఆశాకార్యకర్తలు లక్ష్మీ, లత ఉన్నారు.

టీబీ వ్యాధిపై అవగాహన ర్యాలీ

చాగలమర్రి: డెంగీ, మలేరియా జ్వరాలను నిర్లక్ష్యం చేయరాదని వైద్యుడు ఇమ్రాన్ సూచించారు. సంచార చికిత్స కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని రాంపల్లె గ్రామంలో వైద్యుడు ఇమ్రాన్, సూపర్‌వైజర్ పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీకాంత్, ఏఎస్‌ఎం హైమావతి, ఆశా వర్కర్ మాబుచాను పాల్గొన్నారు.

మండల విద్యాధికారిగా రామకృష్ణయ్య

కొలిమిగుండ్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్ల మండల -1 విద్యాధికారిగా బి.రామకృష్ణయ్యను నియమిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం ఎమ్మార్సీలో రామకృష్ణయ్య బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్యాపిలి మండలం నుంచి బదిలీపై వచ్చానన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేస్తా :ఎంఈవో

డోన్ టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఎంఈవో-2 రఘు నాయక్ అన్నారు. మంగళవారం ఎంఈవో కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. పలువురు ఆయన్ను సత్కరించారు.

సాగులో మెలకువలు పాటించాలి

అవుకు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ప్రకృతి వనరుల కేంద్రం ఏడీఏ చెన్నయ్య అన్నారు. మంగళవారం ప ట్టణంలోని రైతు సేవా కేంద్రం - 2లో వ్యవసాయాధికారి కలిమున్నిసా ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ ఇచ్చారు. ప్రకృతి వనరుల కేంద్రం వ్య వసాయాధికారి వెంకటేశ్వరరెడ్డి, పశువైద్యాధికారి భారతీ దేవి, రైతులు పాల్గొన్నారు.

ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలి

కొలిమిగుండ్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. మంగళవారం ఉమ్మాయిపల్లె, ఉమ్మాయిపల్లెతండా గ్రామాల్లో బాబు ష్యూరిటీ .. మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మొలక రాజారెడ్డి, అంబటి చంద్రమోహన్‌రెడ్డి, సత్యాల్‌రెడ్డి, పేరం రామశంకరరెడ్డి, ఇటిక్యాల శేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.